జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 68 | హైదరాబాద్, మే 24 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

### తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా..

# సీఎం వరాల జల్లు..

## గృహలక్ష్మి పథకానికి మూహూర్తం ఖరారు..

## గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ





హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ ఖరారు, పోడు భూముల పట్టాల పంపిణీ, తదితర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం నాడు సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసిఆర్ పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**గిరిజనులకు పోడు భూముల పట్టాల పంపిణీ :**
జూన్ 24 నుంచి 30 వరకు గిరిజన సోదరులకు పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. నూతనంగా పోడు పట్టాలు పొందిన గిరిజనుల వివరాలు సేకరించి రైతుబంధు వర్తింపచేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. కాగా ఇప్పటికే ఆర్ఓఎఫ్ఆర్ ద్వారా రైతుబంధు పొందుతున్న వారితో పాటు నూతనంగా పోడు పట్టాలు అందుకోబోతున్న గిరిజన లబ్దిదారులతో ను క్రోడికరించి .రాష్ట్రంలో మిగతా రైతులకు ఏవిధంగానైతే రైతుబందు అందుతున్నదో వీరికీ అదే పద్ధతిలో రైతు బంధు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వమే బ్యాంకు అకౌంట్ ను తెరిచి పోడు భూముల పట్టాల యాజమానులకు నేరుగా వారి ఖాతాల్లో రైతుబంధును జమచేస్తుందన్నారు. ఇందుకు సంబంధించి నూతనంగా పోడు పట్టాలు అందుకున్న గిరిజన రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను ఆర్థిక శాఖ వారికి అందజేయాలని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ను సిఎం కేసిఆర్ ఆదేశించారు. పోడు భూముల పంపిణీ కార్యక్రమానికి తానే స్వయంగా హాజరవుతానని సిఎం తెలిపారు.

**జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ :**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యాచరణకు సంబంధించి ఈ నెల 25న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు, జిల్లా ఎస్పీలు పాల్గొంటారు.

### ఢిల్లీ ఆర్డినెన్స్...

# మోడీ సర్కార్‌పై ఆప్, తృణమూల్ కాంగ్రెస్ ఫైర్



ఢిల్లీ :ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై పట్టు కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్రంపై పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతు కూడగడుతోంది. తమ బిల్లులన్నీ రాజ్‌భవన్‌లో మగ్గుతున్నాయని తమిళనాడు సీఎం చెబుతున్నారని, ఇది కేవలం తమ పోరాటమే కాదని ఇది దేశవ్యాప్త పోరాటమని సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ పోలీసులు మనీష్ సిసోడియాను ఎలా ట్రీట్ చేశారో అందరూ చూశారని అన్నారు. ఢిల్లీలో బ్యూరోక్రాట్‌ల పోస్టింగ్, బదిలీలపై నియంత్రణ కోసం కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతు కూడగట్టేందుకు కేజ్రీవాల్ పలు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల కోసం కేంద్రం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ ఏర్పాటు దిశగా ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆప్ పార్టీ... బీజేపీయేతర పార్టీల మద్దతును కోరుతోంది. రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే పార్టీలు ముందుకు రావాలని ఆప్ పిలుపు ఇచ్చింది. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కుదిస్తూ కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను టీఎంసీ కూడా వ్యతిరేకించింది.మే 23వ తేదీ మంగళవారం ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ బృందం కోల్‌కతా వెళ్లి మమతాబెనర్జిని కలిసింది. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పాటు పంజాబ్ సీఎం భగవంత్‌మాన్, ఎంపీ రాఘవ్ చద్దాతో పాటు ఢిల్లీ మంత్రులు కూడా ఉన్నారు.ఢిల్లీలో అధికారాలకు సంబంధించి సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ తీర్పునకు విరుద్ధంగా ఆర్డినెన్స్ తీసుకురావడంపై కేజ్రీవాల్.. మమతాబెనర్జితో చర్చించారు. ఈ విషయంలో కేంద్రంపై ఢిల్లీ సర్కారు చేసే పోరాటినికి మద్దతు నిలువాలని కోరారు. ఈ భేటీ సందర్భంగా మమతాబెనర్జి మాట్లాడుతూ.. బీజేపీపై విమర్శలు గుప్పించారు.కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో గవర్నర్‌లు, ఆర్డినెన్స్‌లు, లెటర్‌ల ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాలను పరిపాలించేలా ఉందని మమతాబెనర్జి ఎద్దేవా చేశారు. కలిసి పనిచేద్దామనే ఉద్దేశం ఉంటే బీజేపీయేతర పార్టీలన్నీ ఒక్క తాటిపైకి రావాలన్నారు. బీజేపీకి ఒక్క ఓటు కూడా పడనీయకుండా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

# జూన్ 9న చేప ప్రసాదం పంపిణీ..

### మంత్రి తలసానితో బత్తిన సోదరుల భేటీ




హైదరాబాద్ :హైదరాబాద్ లో చేప ప్రసాదం పంపిణీ తేది ఖరారు చేశారు బత్తిన సోదరులు. జూన్ 9న ఉదయం 8 గంటల నుంచి 24 గంటల పాటు నిరంతరంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు బత్తిన అమర్నాథ్ గౌడ్. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో మే 23వ తేదీ మంగళవారం సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తో బత్తిన సోదరులు భేటీ అయ్యారు.చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తామని తలసాని తెలిపారు.

## గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్లు విడుదల..




హైదరాబాద్ : గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1190 కోట్ల నిధులను విడుదల చేసింది . సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో భేటీ కాగా, మంగళవారం ఇద్దరు మంత్రులు మరోసారి భేటీ అయి అధికారులతో చర్చించి రూ.1190 కోట్లు విడుదలకు ఆదేశాలు జారీ చేశారు.వివిధ పనుల కింద చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఈ మొత్తాన్ని చెల్లించనున్నారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. (మిగతా 2లో..)

# టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసులో కీలక మలుపు..




హైదరాబాద్ : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు కీలక మలుపు తిరిగింది. లీక్ అంశంలో శంకర్‌లక్ష్మి ప్రమేయం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 2017 నుంచి టీఎస్‌పీఎస్సీలో శంకర్‌లక్ష్మి విధులు నిర్వర్తిస్తున్నారు. డీఏఓ, ఏఈఈ, ఏఈ పేపర్ల అంశంలో.. టీఎస్‌పీఎస్సీ వివరాలు దాచిపెట్టినట్టు గుర్తించారు. పేపర్లు వాల్యుయేషన్ చేయలేదంటూ సిట్‌కు టీఎస్‌పీఎస్సీ తప్పుడు వివరాలు ఇచ్చినట్టు తేలింది. ఇప్పటి వరకు సిట్‌కు ఓ స్టేట్‌మెంట్, ఈడీకి మరో స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు గుర్తించారు అధికారులు. ఈ కేసులో శంకర్‌లక్ష్మి కాల్‌డేటా వివరాలను సిట్ సేకరించింది. మరోవైపు రేణుకను మరోసారి విచారించబోతోంది సిట్.ఇదిలా ఉంటే.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో ఇప్పటివరకు 35 మందిని అరెస్టు చేసింది సిట్. DAO పరీక్షలో ర్యాంకులు.. అత్యధిక మార్కులు సాధించిన వారిపై దృష్టి ప్రత్యేక దృష్టి సారించింది. డీఏఓ పరీక్షలో లీక్ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాజేశ్వర్‌కు ఫస్ట్ ర్యాంకు, రాజేశ్వర్ భార్య శాంతికి రెండో ర్యాంకు.. మరో నిందితురాలు రేణుక స్నేహితుడు రాహుల్ కుమార్‌కు మూడో ర్యాంక్ వచ్చింది. ఆ దిశగా ఎంక్వైరీ చేసిన అధికారులు కీలక విషయాలు రాబట్టారు.ఓ వైపు సిట్ దర్యాప్తు కొనసాగుతూ ఉండగానే.. తీగ లాగితే డొంక కదిలినట్టు భారీ మొత్తంలో మనీలాండరింగ్ జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఇదే నేపథ్యంలో ఇటీవల టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌నీ, సెక్రటరీనీ ప్రశ్నించింది ఈడీ. జనార్ధన్‌రెడ్డి, అనితా రామచంద్రన్ స్టేట్‌మెంట్స్‌ని ఇటీవల రికార్డ్ చేసింది. మొత్తం 31 లక్షల లావాదేవీలు జరిగినట్టు గుర్తించింది సిట్. ఇదే నేపథ్యంలో కేసులో కీలక నిందితుడు ప్రవీణ్ దగ్గరనుంచి ఇంకా ఎవరెవరు ప్రశ్నాపత్రాలు కొన్నారనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది.



## "గిరి వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి"

**జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే**



ఆసిఫాబాద్ జిల్లా మే 23 (ప్రజాపాలన ప్రతినిధి) : రైతుల సంక్షేమం, అభివృద్ధి కొరకు చేపట్టిన ''గిరి వికానం'' పథకాన్ని అకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ వాజ్పాయి తో కలిసి, జిల్లా గ్రామీణ అభివృద్ధి, విద్యుత్ శాఖ అధికారులతో గిరి వికాసం పథకం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గిరి వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, జియో లాజికల్ సర్వే వెంటనే పూర్తిచేసి బోర్లు, వ్యవసాయ బావులు, తవ్వించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి రైతులు వ్యవసాయ సాగు చేసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. గిరి వికాస్ కింద మంజూరైన వ్యవసాయ బావులకు మోటర్లు బిగించి ఈ ఖరీఫ్లో సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఏపీవో కుటుంబరావు, విద్యుత్ శాఖవాసుదేవ్,ఇంజనీరింగ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన జిల్లా రవాణా కార్యాలయ భవనం ప్రారంభం

నిర్మల్, మే 23, ప్రజాపాలన: నిర్మల్ జిల్లా కేంద్రంలోని చించోలి బి



శివారులో రూపాయలు 3 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన నిర్మల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయ ఆర్ టి ఓ భవనాన్ని మంగళవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జిల్లా పాలనాదికారితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాగా ఏర్పడిన నిర్మల్ జిల్లా గత దశాబ్ద కాలంగా అన్ని రకాల అభివృద్ధి సాధించిందని త్వరలో నిర్మల్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటించి నూతనంగా నిర్మించిన జిల్లా కలెక్టర్ కార్యాలయం తో పాటు జిల్లాకు కొత్తగా మంజూరైన మెడికల్ కాలేజీని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిర్మల్ జిల్లాలో ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో జిల్లా రవాణా కార్యాలయాన్ని నిర్మించడం జరిగిందని ఈ కార్యాలయంలో వచ్చే ప్రజలకు వారు సేదతీరే విధంగా ప్రత్యేకంగా వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వారికి ఆహల్లాదాన్ని పంచే విధంగా చుట్టూ మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. రవాణా చట్టాలను తెలుసుకోవాలని, రోడ్డు రవాణా చట్టాలను ప్రతి ఒక్కరు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషిచేయాలని, చిన్న వాహనాలు పెద్ద వాహనాలను పరీక్షించడానికి 5 ఎకరాల స్థలంలో అణువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండెవిట్టల్ రెడ్డి రవాణా శాఖ అధికారి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమీకృత కలెక్టరేట్ భవన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి

**జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

మంచిర్యాల బ్యూరో, మే 22, ప్రజాపాలన :సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల (కలెక్టరేట్) సముదాయం భవనం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో నిర్మితమవుతున్న సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్తో కలిసి పరిశీలించారు. కలెక్టరేట్ భవనంలో జిల్లా శాఖల కార్యాలయాలు, వివిధ సేవల నిమిత్తం కలెక్టరేట్కు వచ్చే ప్రజలు వేచి ఉండే ప్రాంతాలు, భవన ఆవరణ, సమావేశ మందిరం పనులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన కలెక్టరేట్ పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అంతర్గత రహదారులు, గ్రీన్ కారిడార్, మురుగు కాలువల వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు-భవనాల శాఖ ఈ. ఈ. పెద్దన్న, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు


## గచ్చిబౌలిలో ఫ్లాగ్షిప్ క్లినిక్ని ప్రారంభించిన ఆశా న్యూరోమోడ్యులేషన్ క్లినిక్

హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): భారతదేశంలో ఎన్నో వేల మంది మానసిక రోగులకు అత్యుత్తమ చికిత్సలు అందించడం ద్వారా, వారిలోని మానసిక, భావోద్వేగ,వ్యసన సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రైవేట్ రంగంలోని మానసిక రోగ చికిత్సాలయాలలో దేశంలోనే ప్రథమ స్థానం లో ఉన్న ఆశా హాస్పిటల్, తన అనుబంధ విభాగంలో ఉన్న ఆశా న్యూరోమోడ్యులేషన్ క్లినిక్ (ఎ ఎన్ సి) యొక్క మరొక శాఖను, హైదరాబాదులోని గచ్చిబౌలిలో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎ ఎన్ సి డైరెక్టర్, %ణతీ% ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆరోగ్య సంస్థల రాజధానిగా విరజిల్లుతున్న హైదరాబాద్ నగరంలో ఈ శాఖను ప్రారంభించడం వలన ఎ ఎన్ సి , తన సేవలను మరెందరో ఎం ఎన్ సి ఉద్యోగులు, దేశ విదేశీ ఉద్యోగులకు కూడా అందించబడుతుందన్నారు. వారిలోని మానసిక, , భావోద్వేగ, ధూమపాన, ఇతర వ్యసనాల వారి సమస్యలకు సరైన చికిత్స అందించడం ద్వారా వారికి సహాయం చేయగలదని అన్నారు.

# కెనడాలో అత్యుత్సాహంగా అన్నమయ్య ఆరాధనోత్సవాలు







కెనడా (ప్రజాపాలన ప్రతినిధి):'వీధుల వీధుల విభుడేగే' అనే అన్నమయ్య కృతిలో ఉన్నట్టు కెనడా వ్యాప్తంగా ఆరు ప్రావిన్స్ ల నుండి 108 విలక్షణమైన అన్నమయ్య కృతులతో 11 గంటల పాటు అన్నమయ్య ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలుగుతల్లి కెనడా శ్రీమతి లక్ష్మి రాయవరపు బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రఖ్యాత తెలుగు సినిమా కథ, పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ , శ్రీమతి యస్ పి వసంత లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో మొదటగా శ్రీమతి ఉమా సలాది దీప ప్రజ్వలన చేయగా, శ్రీమతి పాణంగిపల్లి విజయలక్ష్మి ప్రార్థన గీతం తో సభ మొదలైంది. అశోక్ తేజ మాట్లాడుతూ జీవితంలో ప్రతి సందర్భంలోనూ అతి చిన్న పదాలతో జనాలు నాల్కల మీద తిరిగే రచనలు వ్రాసిన అన్నమయ్య తన వంటి ఎందరో రచయితలకి మార్గ దర్శకులు అయ్యారని, అన్నమయ్య పుట్టిన తిథి లోనే తను కూడా పుట్టారని తెలియజేస్తూ, అన్నమయ్య గురించి చేసిన ప్రసంగంలో ఎన్నో ఆసక్తి కరమైన విషయాలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ ద్వారా తెలుగుతల్లి కెనడా భావి తరాలకు మంచి సంస్కృతి, సంస్కారాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. తెలుగుతల్లి కెనడా తరఫున ఆయన భార్య శ్రీమతి నిర్మల చేతుల మీదుగా సత్కారం పొందడం చాలా ఆనందం కలగజేసిందని, ఈ కొత్త రకం సత్కారం ఏర్పాటు చేసిన తెలుగు తల్లి కమిటీ వారిని అభినందించారు. శ్రీమతి యస్ పీ వసంత లక్ష్మి మాట్లాడుతూ, ఎప్పుడు విదేశాలకి ప్రయాణం చెయ్యలేదని ఈనాడు కెనడా వచ్చిన అనుభూతి కలిగిందని చెప్పారు. చక్కని ఆత్మీయమైన మాటలతో, పాటతో వారు అందరినీ అలరింప జేసారు. తెలుగుతల్లి కెనడా శ్రీమతి లక్ష్మి రాయవరపు గొప్ప జాతీయవాది అని,తెలుగు జాతి అభిమాని అని తెలిపారు. శ్రీమతి లక్ష్మి మాట్లాడుతూ మన తెలుగు భాషలో ఎన్నో గొప్ప భక్తి గీతాలు, మహాభారతం, రామాయణం , భాగవతం ఎన్నో ఉన్నాయని, అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని బిరుదు గాంచారని, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ని, అహోబిలం లోని నరసింహ స్వామి ని, కీర్తిస్తూ 32 వేలకు పైగా కీర్తనలు రచించారన్నారు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, పెనవేసికొని ఉంటాయని,తెలుగు భాషకి అత్యున్నత వైభవం అన్నమయ్య కృతులు దేశ విదేశాలకు పరిచయం చేయాలనే సంకల్పం అన్నారు. తెలుగుతల్లి కెనడాసంస్థకు సహకరిస్తున్న పత్రిక కమిటీని, వివాహ వేదిక కమిటీని, యూట్యూబ్ కమిటీని , పిల్లల మాసపత్రిక గడుగ్గాయి కమిటీని పరిచయం చేస్తూతెలుగుతల్లి కెనడా శ్రీమతి లక్ష్మి రాయవరపు ప్రతి సంవత్సరం ఈ వేడుకలు వివిధ ప్రదేశాలలో జరుగుతున్నప్పటికీ, దేశవ్యాప్తంగా ఒక వేదిక మీద జరగడం గత సంవత్సరం నుండి మొదలు పెట్టారన్నారు. త్యాగరాయ ఉత్సవాల్లో గుర్తింపు పొందిన ఒక సీనియర్ గాయని/ గాయకునికి జీవన సాఫల్య పురస్కారం అందించడం ఎంతో అదృష్టం గా భావిస్తున్నామని తెలుగుతల్లి కెనడా నిర్వాహకులు పేర్కొన్నారు. తెలుగుతల్లి కెనడా వెబ్ మాసపత్రిక తో పాటు ప్రతినెలా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దేశంలో ఉన్న ప్రతిభావంతులైన వారందరినీ ఒక చోట చేర్చడం తన లక్ష్యమని తెలుగుతల్లి కెనడా వ్యవస్థాపకులు శ్రీమతి లక్ష్మి రాయవరపు తెలిపారు. అతిథులకు భాస్కర వర్మ వందన సమర్పణ తో మొదటి సభ ముగిసి, 10 గంటల పాటు 108 విలక్షణమైన అన్నమయ్య కీర్తనలు 4 నృత్యాలు, వీణా వాదనలతో కెనడా ప్రతిభ చూపరులను కదలకుండా కట్టి పడేసింది. ఈ కార్యక్రమం పట్ల భారత , కెనడా, అమెరికా దేశాల నుంచి పలువురు ప్రముఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ ఉత్తర్వులను మంగళవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు 18 మరియు 19 జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం కొత్తగా 4 చీఫ్ ఇంజనీర్, 12 సర్కిల్ ఇంజనీర్, 11 డివిజన్ ఇంజనీర్, 60 సబ్ డివిజన్ ఇంజనీర్ పోస్టులను మంజూరు చేసింది. అలాగే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఏడాదికి రూ.5 లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు రూ.25 లక్షలు, సూపరింటెండింగ్ ఇంజనీర్ కు రూ. కోటి, చీఫ్ ఇంజనీర్ కు రూ. 2.50 కోట్లు, ఇంజనీర్ ఇన్ చీఫ్ కు రూ. 5 కోట్ల వరకు పనులు మంజూరు చేసే అధికారం ఇచ్చింది. పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణ చేసిన గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి తెలంగాణ రాష్ట్ర పంచాయతి రాజ్ ఇంజినీర్ల తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందుకు ఎనలేని కృషిచేసిన ప్రియతమ గౌరవ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర రావు, ప్రోత్సహించిన గౌరవ మంత్రి వర్యులు తన్నీరు హరీష్‌రావు,సహకరించిన గౌరవ మంత్రి వర్యులు కల్వకుంట్ల తారక రామ రావు మరియు తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గానికి మరియు సంగారెడ్డి జిల్లా శాసనసభ్యులకు నాయకులకు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా యూనిట్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు అన్ని వేళల్లో మార్గదర్శకం వహించిన శ్రీమతి ఏ. శాంతి కుమారి, ఐఏఎస్, చీఫ్ సెక్రటరీ, శ్రీ కె. రామ కృష్ణా రావు, ఐఏఎస్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆర్థిక శాఖ , సందీప్ కుమార్ సుల్తానియా, ఐఏఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ పంచాయతి రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మరియు శ్రీమతి స్మితా సభర్వాల్, ఐఏఎస్, సెక్రటరీ ముఖ్యమంత్రి కార్యాలయం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు మా ప్రియతమ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఏ.జి. సంజీవ రావు గారికి పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ శాఖ సంగారెడ్డి జిల్లా యూనిట్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ప్రముఖ వైద్యులు, పొంగులేటి శ్రీనివాస్,మధిర నియోజకవర్గ డా.కోట రాంబాబు



మధిర, (ప్రజాపాలన ప్రతినిధి):మొదటిగా ఎర్రుపాలెం మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ముక్కెర రమణారెడ్డి గారి మనుమడు పునీత్ రెడ్డి అన్నప్రాసన వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు... అనంతరం గంపలగూడెం మండలం రాజవరం గ్రామంలో గట్టిగుండె జ్ఞానానంధం గారి కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.....అనంతరం మధిర మండలం సిరిపురం గ్రామంలో వేల్పుల రమేష్ గారి కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు..... అనంతరం ముదిగొండ మండలం మేడిపల్లి గ్రామంలో బొడ్డు నాగేంద్రబాబు, భవాని ల వివాహం నిన్న జరుగగా ఈరోజు నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.... అనంతరం అదే గ్రామంలో బొడ్డు రాములు గారి కుమార్తె వివాహం ఇటీవలే జరుగగా ఈరోజు నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.... ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్లు గారు, నంద్రు విజయారావు గారు, బొడ్డు నాగరాజు గారు, బొడ్డు సంజీవరావు గారు, బొడ్డు నాగరాజు గారు, రవి కుమార్ గారు, నాగేశ్వరరావు గారు, వెంకటేశ్వర్లు గారు, జగన్ గారు తదితరులు పాల్గొన్నారు.....

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

**రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు**



మంచిర్యాల బ్యూరో,మే 23, ప్రజాపాలన :తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య-ఆరోగ్యశాఖ అధికారులతో ఆరోగ్య కేంద్రాలు, కంటి వెలుగు, న్యూట్రిషన్ కిట్ల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతతో బాధపడకుండా ప్రభుత్వం చేపట్టిన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం మొదటి దశలో 9 జిల్లాల్లో అమలు చేయడం జరిగిందని, రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే హెల్త్ డే రోజున 24 జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో అట్టహాసంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84 లక్షల మంది గర్భిణీలకు కె.సి.ఆర్. కిట్లు అందేలా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజల కంటి సమస్యలు తొలగించేందుకు చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 80 పని దినాల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1 కోటి 50 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి 38 లక్షల 54 వేల మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని, ఇందులో 21 లక్షల 46 వేల మందికి రీడింగ్ అద్దాలు 8 వేల మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఉపాధిహామీ కూలీల సంక్షేమం దృష్ణా పని ప్రదేశాలలో నీడ, త్రాగునీరు ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర అవతవరణ దశాబ్ది ఉత్సవాల ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని, కంటి వెలుగు 2వ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 40 కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి 40 బృందాలను నియమించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తూ అవగాహన కల్పించడం జరుగుతుందని, రక్తహీనత సమస్యను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. జి.సి. సుబ్బారాయుడు, వైద్యాధికారి డా. అరవింద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు రూ.1190 కోట్లు విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

**సర్పంచుల సంఘం హర్షం**

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణతో పాటు, పంచాయతీలకు నిధులు విడుదలపై రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెకల్లి దయాకర్ రావును హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో కలిసి సంతోషం వ్యక్తం చేశారు. నిధులను విడుదల చేయడం పట్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మనసున్న మహరాజని కొనియాడారు. మాట తప్పకుండా, అందరి శ్రేయోభిలాషిగా ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రగతిని దృష్టిలో పెట్టుకుని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా, నిధులు విడుదల చేస్తూ అభివృద్ధిని నిరాటంకంగా కొనసాగిస్తున్నారని అన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కరువు



శంకరపట్నం మే 23 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పని స్థలంలో కూలీలకు సౌకర్యాలు మంచినీటి సదుపాయం, పని స్థలంలో టెంట్ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఇక్కడ కూలీలకు అలాంటి సౌకర్యాలు ఏమి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారని, కూలీలు మూడు కిలోమీటర్ల పైబడి కాలినడకన పని స్థలానికి వెళ్తున్నారని, కూలీలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

## కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మర్రి నిరంజన్ రెడ్డి



ఇబ్రహింపట్నం మే తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపేనర్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రివర్యులు, తెలంగాణ సాధన కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన ఉద్యమ వీరుడు, టైగర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన సందర్భంగా బ్రాహ్మణ వెల్లంలో ఈరోజు జరిగిన జన్మదిన వేడుకలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్ బైక్ ర్యాలీ గజమాలతో సభా స్థలికి చేరుకొని బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం సాగునీటి ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల సంబరాలు నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్యలో భారీ కేకును కట్ చేసి ఘనంగా ఒక పండుగ వాతావరణంల ఆనందోత్సవాల మధ్యన జరుపుకున్నారు, కే వి ఆర్ ఎం ఎన్ ర్ అభిమానులు బాణాసంచాలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు, ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆండాలమ్మ కాలనీ డంపింగ్ యార్డ్ తరలించాలి



మంచిర్యాల టౌన్, మే 23, ప్రజాపాలన: ఆండాలమ్మ కాలనీ డంపింగ్ యార్డ్ తరలించాలి అని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లకు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆండాలమ్మ కాలనీ డంపింగ్ యార్డ్ పై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కి ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల ఆండాలమ్మ కాలనీ రంగపేట గ్రీన్ సిటీ పవర్ సిటీ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల ప్రజలు డంపింగ్ యార్డ్ నుంచీ వచ్చే వాసన పొగ వల్ల చాలా తీవ్రంగా ఇబ్బంది పడుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారని ఈ డంపింగ్ యార్డ్ వల్ల శ్వాసకోశ సమస్యలు ఆస్తమా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం కూడా లేకపోలేదని అన్నారు. మంచిర్యాల పట్టణం దగ్గర లో ఉన్న పోచంపాడులో శివారులో పది ఎకరాల స్థలం ప్రభుత్వం కేటాయించడం జరిగింది కానీ ఆ యొక్క డంపింగ్ యార్డ్ కు వెళ్లడానికి దారి లేక చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించలేక ప్రస్తుతము ఉన్న డంపింగ్ యార్డ్ కే తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు నల్ల నాగేంద్ర ప్రసాద్ మంచిర్యాల నియోజకవర్గ కోఆర్డినేటర్ నయీం పాషా కొంటూ రాజేందర్ శ్రీకాంత్ శ్రీనివాస్ విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి: హరీష్‌రావు





ఇబ్రహింపట్నం మే తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: మంగళవారం జిల్లా కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ, ఇప్పటికే తొమ్మిది జిల్లాలలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించే హెల్త్ డే రోజున మిగతా 24 జిల్లాలలోని అన్ని శాసనసభ నియోజకవర్గ కేంద్రాల్లో అట్టహాసంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.84 లక్షల మంది గర్భిణీలకు వీటిని అందజేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలిగామని, మాతాశిశు మరణాలను అరికట్టడంలో తెలంగాణ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. అంతే కాకుండా, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ఇదే కోవలో గర్భిణీల్లో రక్తహీనతను నివారిస్తూ, పుట్టబోయే శిశువులు ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రస్తుతం న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమం కూడా మంచి ఫలితాలను అందిస్తుందనే నమ్మకం ఉందని మంత్రి ఆహ్వాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాల ప్రగతి గురించి మంత్రి హరీష్ రావు జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత భవనాలు మంజూరు చేసినందున, వాటి నిర్మాణాలకు అవసరమైన స్థలాలను కేటాయించాలని కలెక్టర్లకు సూచించారు. టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన చోట నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా పల్లె దవాఖానాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. కాగా, కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 80 పని దినాల్లో రాష్ట్ర వ్యాప్తంగా కోటిన్నర మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 38,54,000 మందికి కంటి అద్దాలు అందించడం జరిగిందని వివరించారు. ఇందులో 21,46,000 మందికి రీడింగ్ అద్దాలు, 17,08,000 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేశామని అన్నారు. ఏ చిన్న సమస్య ఉత్పన్నం కాకుండా ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజలందరి సహకారంతోనే ఇది సాధ్యమైందని మంత్రి హర్షం వెలిబుచ్చారు. ఇప్పటికే దాదాపు తొంభై శాతం స్క్రీనింగ్ పూర్తయినందున కంటి వెలుగు శిబిరాల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏ.ఎన్.ఎం లను వారివారి సాధారణ విధుల నిర్వహణ నిమిత్తం రిలీవ్ చేయాలని సూచించారు. మిగతా సిబ్బందితో కంటి వెలుగు శిబిరాలను మరింత రెట్టింపు ఉత్సాహంతో నిర్వహిస్తూ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కాగా, వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా సూచనలు అందించాలని, పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు వంటి వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు హితవు పలికారు. జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాకు 81 బస్తీ దవాఖానాలు మంజూరు అయినవని, అందులో 59 బస్తీ దవాఖానాలను వినియోగంలోకి తీసుకురావడం జరిగినదని, 6 బస్తీ దవాఖానాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, 5 బస్తీ దవాఖానాల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 71 పల్లె దవాఖానాలు మంజూరు అయినవని, అందులో 35 పల్లె దవాఖానాలకై స్థలాన్ని గుర్తించామని, 36 పల్లె దవాఖానాలకై స్థలాన్ని గుర్తించి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటేశ్వర్ రావు, సంబంధిత వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు..: జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్

### వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం





ఆసిఫాబాద్ జిల్లా మే 23 (ప్రజాపాలన,ప్రతినిధి) : నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని సంతోష్ ఫంక్షన్ హాల్ లో వ్యవసాయ శాఖ, పోలీస్, ఫర్టిలైజర్స్ షాప్స్, అగ్రికల్చర్ అధికారులతో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసగిస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్, డీజీపీ అంజని కుమార్,ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించిన, సరఫరా చేసిన, పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. వర్షాకాలం సాగును దృష్టిలో ఉంచుకొని రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నకిలీ విత్తనాల సరఫరా ఉత్పత్తి అమ్మకాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీస్ శాఖ, సంయుక్తంగా మండల స్థాయిలో ప్రత్యేక స్పెషల్ ట్రాక్ ఫోర్స్, స్థానిక పోలీస్ టీం, ఎప్పటికప్పుడు తనిఖీలు, అవగాహన సదస్సులు, నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా వ్యాపారాలు, సంస్థలు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే పోలీస్ అధికారులకు గాని, డయాల్ 100 కు గాని 6302430500 కు గాని సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ లు బుద్ధ స్వామి, నాగరాజు, సాదిక్ భాషా, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన వ్యాపారులపై టాస్క్ ఫోర్స్ దాడులు?



శంకరపట్నం మే 23 ప్రజాపాలన రిపోర్టర్: నకిలీ సీడ్ విత్తనాలు తయారీ చేసి రైతులకు అంటగడుతున్నారనే సమాచారముతో జిల్లాలో టాస్క్ ఫోర్స్ పోలీస్, అగ్రికల్చర్ అధికారులు తనికీలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్ పల్లి గ్రామంలో విడి మక్కలు సీడ్ గా రైతులకు అమ్ముతున్నాడానే సమాచారంతో జూంగోని రమేష్ అనే సీడ్ వ్యాపారి ఇంటిపై టాస్క్ ఫోర్స్ పోలీస్, అగ్రికల్చర్ అధికారులు దాడి చేయగా ఎలాంటి అనుమతులు లేని 210 క్వింటల్ల మొక్క జొన్న బస్తాలను గుర్తించారు. సరైన పత్రాలు చూపించే వరకు మొక్క జొన్న దాన్యాన్ని అమ్మవద్దని అగ్రికల్చర్ అధికారులు సదరు సీడ్ వ్యాపారికి నోటీసు జారీ చేశారు.రైతులు సరైన ధ్రువ పత్రాలు లేని సీడ్ లు కొని మోసపోవద్దని, రైతులను మోసం చేసి సీడ్ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు చెబుతున్నారు.


## "ఘనంగా మాదరి భాగ్యరెడ్డి వర్మ 135 వ జయంతి"

### జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

### దళితుల కోసం విశిష్ట కృషి చేసిన మహనీయుడు: ఎమ్మెల్యే ఆత్రం సక్కు



ఆసిఫాబాద్ జిల్లా మే 22 (ప్రజాపాలన,ప్రతినిధి) : దళితులకు విద్యా అవకాశం కల్పించేందుకు కృషిచేసిన మహనీయుడు మాదరి భాగ్యరెడ్డి వర్మ అని, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహా దేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్పాయి. లతో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత జాతికి విద్యా అవకాశాలు కల్పించేందుకు పాఠశాలలు తెరిచి వారితో మార్పునకు కృషిచేసిన మహానీయుడు అన్నారు. ఆ కాలంలో భోగిని, దేవదాసి, వ్యవస్థ నిర్మూలించేందుకు అహర్నిశలు కృషి చేశారని, మహిళల సంక్షేమం దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను సాధించి దళితుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అరిగెల నాగేశ్వర్ రావు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సంజీవన్, ఏఎంసీ గాదె వేణి మల్లేష్, రేగుంట కేశవ్ రావు,గోపాల్, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం


బుధవారం 24, మే 2023

# ఈ అజ్ఞానంపై అక్షర వెలుగులేవీ?

తెలంగాణ రాష్ట్ర సమితి ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఒకటి 2020 నవంబర్‌లో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో సమావేశమై ఒక విజ్ఞప్తి చేసింది. తమ పార్టీ అధికారిక చిహ్నం 'కారు'ను పోలిన ఎన్నికల చిహ్నాలను తొలగించాలన్నదే ఆ అభ్యర్థన. స్వతంత్ర అభ్యర్థులకు కేటాయిస్తున్న ఎన్నికల చిహ్నాలు, ఎన్నికల ఫలితాలు తమ పార్టీకి ప్రతికూలంగా ఉండేలా ప్రభావితం చేస్తున్నాయన్నది టీఆర్ఎస్ నేతల వాదన. స్వతంత్రులకు కేటాయించిన చిహ్నాలు తమ పార్టీ చిహ్నాన్ని పోలి ఉంటున్నందున ఓటర్లు గందరగోళపడుతున్నారని అంటూ దుబ్బాక ఉప ఎన్నిక ఫలితాన్ని ఉదాహరణగా చూపారు. దుబ్బాకలో స్వతంత్ర అభ్యర్థి నాగరాజుకు 'రోటీ మేకర్' చిహ్నాన్ని కేటాయించినందున అతనికి 3510 ఓట్లు లభించాయని, అతని ఎన్నికల చిహ్నం తమ పార్టీ చిహ్నాన్ని పోలి ఉండడం వల్లే తమకు రావాల్సిన ఓట్లు నాగరాజుకు పడ్డాయని, ఫలితంగా టిఆర్ఎస్ 1431 ఓట్ల తేడాతో ఓడిపోయిందని వారి వాదన. ఆ స్వతంత్ర అభ్యర్థికి 'రోటీ మేకర్' కేటాయించకపోయినట్టయితే చిహ్నాల విషయంలో ఓటర్లు అయోమయానికి గురయ్యేవారు కాదని, తమ పార్టీ అభ్యర్థి గెలిచేవాడని టిఆర్ఎస్ ప్రతినిధి బృందం వాదించింది. 2022 మే 21న ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీలోని ఒక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యా బోధన సదుపాయాలను పరిశీలించిన అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ 'పాఠశాల విద్యను మెరుగుపరిచేందుకు ఢిల్లీ ప్రభుత్వం ప్రశస్త కృషి చేస్తోందని' ప్రశంసించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'విద్యార్థులు మంచి మార్కులు సాధించడమే ఢిల్లీ విద్యా విధాన లక్ష్యంగా లేదు. ఉద్యోగాలకు ప్రయత్నించే వారుగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వారుగా విద్యార్థులు ఎదిగేందుకు తోడ్పడటమే ఢిల్లీ ప్రభుత్వ విద్యా విధానం ధ్యేయంగా ఉన్నది. ఇటువంటి కృషి దేశంలో మరెక్కడా లేదు. ఈ విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసేందుకు, తెలంగాణ రాష్ట్రంలోనూ దాన్ని అమలుపరిచేందుకు మా విద్యాశాఖ ఉన్నతాధికారులను త్వరలో ఢిల్లీకి పంపుతాము'. 2022 అక్టోబర్ 10న మునుగోడు ఉపఎన్నికను ప్రకటించినప్పుడు కెమెరా, చపాతీ రోలర్, రోడ్ రోలర్, టెలివిజన్, కుట్టు మెషీన్, నౌక మొదలైన స్వతంత్ర ఎన్నికల చిహ్నాలను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నాటి తెలంగాణ రాష్ట్ర సమితి లేఖ రాసింది. ఆ చిహ్నాలన్నీ తమ అధికారిక చిహ్నం 'కారు'ను పోలి ఉన్నాయని, ఈ పోలిక మూలంగా ఓటర్లు ఓటు వేసేటప్పుడు అయోమయానికి గురై తమ పార్టీకి వేయాల్సిన ఓటును కూడా అనామక అభ్యర్థులకు వేస్తున్నారని టిఆర్ఎస్ తన లేఖలో వివరించింది. టిఆర్ఎస్ అభ్యర్థనను రాష్ట్ర ఎన్నికల సంఘం తిరస్కరించడంతో పైన పేర్కొన్న చిహ్నాలను రద్దుచేసేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో టిఆర్ఎస్ పిటిషన్ వేసింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్ కొట్టివేసింది. దీనిపై తెలంగాణ రాష్ట్ర పాలక పక్షం కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఓటర్లను గందరగోళపరుస్తున్న సదరు ఎన్నికల చిహ్నాలను తొలగించాలని కోరింది. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఆ అభ్యర్థనను తిరస్కరించింది. మునుగోడు ఉప ఎన్నిక ఫలితం వెలువడిన అనంతరం రాష్ట్ర మంత్రి కేటీఆర్ విలేఖర్లతో మాట్లాడుతూ తమ పార్టీ అభ్యర్థి పదివేల ఓట్ల మెజారిటీతో గెలుపొందాడని అధికారికంగా ప్రకటించారని, నిజానికి తమ అభ్యర్థికి 17 వేల ఓట్ల మెజారిటీ వచ్చి ఉంటుందని అన్నారు. స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల చిహ్నాలు 'కారు' గుర్తును పోలి ఉన్నందున తమ పార్టీకి పడాల్సిన ఓట్లు ఆయా స్వతంత్ర అభ్యర్థులకు వెళ్లాయని, వారికి ఆ ఎన్నికల చిహ్నాలను కేటాయించకుండా ఉన్నట్టయితే తమ పార్టీ మెజారిటీ మరింత అధికంగా ఉండేది కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల చిహ్నాల విషయంలో ఓటర్లు అయోమయానికి గురయ్యారన్నమాట నిజమే అయితే కేసీఆర్, కేటీఆర్‌ను ఒక ప్రశ్న అడగాల్సిందే. రాష్ట్ర జనాభాలోని అత్యధికులు ఎన్నికల చిహ్నాలలోని తేడాలను స్పష్టంగా గుర్తించలేనంతగా అవిద్యావంతులన్న వాస్తవాన్ని మీరు అంగీకరిస్తున్నారా? ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని మీడియాకు చెప్పడం, ఎన్నికల సంఘానికి లేఖలు రాయడం, కోర్టుల్లో కేసులు దాఖలు చేయడం పై విషయాన్నే సూచిస్తున్నది మరి. అభ్యర్థుల పేర్ల జాబితాను చదవడం, ఎవరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోలేకపోవడమే కాదు, ఎన్నికల చిహ్నాల మధ్య తేడాను కూడా గమనించలేనంత నిరక్షరాస్యత, అవగాహనా రాహిత్యంలో రాష్ట్ర ప్రజల్లో అత్యధికులు ఉన్నారా? కారు%--%టెలివిజన్, కారు%--%కెమెరా మధ్య తేడాను సైతం వారు గుర్తించలేకపోతున్నారా? తొలగించవలసిన ఎన్నికల చిహ్నాలు అంటూ ఎన్నికల సంఘానికి మీరు సమర్పించిన జాబితాలో కెమెరా, చపాతీ రోలర్, పల్లకీ, రోడ్ రోలర్ వంటివి అనేకం ఉన్నాయి. ఈ రాష్ట్ర జనాభాలో 80 శాతం మంది బలహీన వర్గాల వారు కదా, మీరు అభ్యంతరం తెలుపుతున్న ఎన్నికల చిహ్నాలకు, మీ పార్టీ గుర్తు 'కారు'కు మధ్య వ్యత్యాసాన్ని గమనించలేనంతటి నిరక్ష రాస్యులా? ఎన్నికల సంఘం, మీడియా, న్యాయస్థానాలు ఇలా ప్రతిచోటా ఈ రాష్ట్రంలోని ప్రజలు కారుకూ మిగతా వస్తువులకు మధ్య తేడాను గుర్తించలేకపోతున్నారని వాదిస్తున్నందున పాలకులు రాష్ట్రంలో అవిద్య, అవగాహనారాహిత్యం అధికస్థాయిలో ఉన్నదని అంగీకరిస్తున్నట్టే అర్థం. మరి ఈ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేస్తున్నది? రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఏదైనా విధానాన్ని ప్రకటించారా? కెజి నుంచి పిజిదాకా మొదలైన నినాదాల గురించి నేను మాట్లాడడం లేదు. 2022 మే 21న దేశరాజధానిలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన గుర్తుచేసుకుందాం. పాఠశాల విద్యలో ఢిల్లీ నమూనాను తెలంగాణలో అమలుపరుస్తామన్న హామీ ఏమైంది? అసలు అటువంటి ప్రణాళిక దేనినయినా రూపొందించారా? 2022 డిసెంబర్ 22న తెలంగాణ ప్రభుత్వం 'కేసీఆర్ స్కూల్ కిట్స్' అనే కొత్త విద్యా పథకం ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద బాలలకు ఉచిత స్కూల్ బ్యాగులు, బూట్లు, మేజోళ్లు, టైలు, ఐడి కార్డులు సమకూర్చనున్నారు. వీటి వల్ల ప్రయోజనమేమిటి? పాఠశాలల్లో నాణ్యమైన విద్యను సమకూర్చడం అన్నిటికంటే ముఖ్యం కదా. సరైన విద్యా బోధనా సదుపాయాలు ఎన్ని పాఠశాలల్లో ఉన్నాయి? వాటిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఏమి చేస్తున్నది? 'కేసీఆర్ స్కూల్ కిట్స్'తో పిల్లలు పాఠశాలలకు హాజరవుతారు సరే, మరి నాణ్యమైన విద్య విషయమేమిటి? అలా ప్రభుత్వం సమకూర్చే సదుపాయాలతో ఓటు వేసే వయస్సు వచ్చే వరకు పెరుగుతారు. తీరా ఓటు వేయవలసిన సమయంలో ఏ పార్టీ చిహ్నం ఏమిటో, తాము కచ్చితంగా ఏ చిహ్నానికి వేయాలో తెలియక అయోమయంలో పడతారు! ఏది టెలివిజన్, ఏది కారు అనే విచక్షణ చూపించలేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సరే, ఇలాంటి పరిస్థితి టిఆర్ఎస్ లక్ష్యాన్ని నెరవేరుస్తుంది. ఏమిటా లక్ష్యం? కేసీఆర్ స్కూల్ కిట్‌లు పొందిన బాలల తల్లిదండ్రులు టిఆర్ఎస్ ఓటు బ్యాంకులు అవుతారు. దశాబ్దాలుగా వివిధ పార్టీల ప్రభుత్వాలు, పన్నుల రూపేణా కోశాగారానికి చేరిన ప్రజల సొమ్మును ఇలా తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగిస్తూనే ఉన్నాయి.

# మోదీ హయాం.. భారత్‌కు శాపం

దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో 2017 మార్చిలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 44 ఏండ్ల వయసున్న యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవిని చేపట్టారు. హిందుత్వ శ్రేణులు ఆయనను 'హిందూ సింహం'గా అభివర్ణించాయి. నిజంగానే, విద్వేష హిందూ రాజకీయాల్లో ఆయనది అందెవేసిన చేయి. ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్, రచయిత, కాలమిస్టు అశోకా మోదీ రాసిన 'ఇండియా ఈజ్ బ్రోకెన్‌బీ ఎ పీపుల్ బిట్రేయ్డ్, 1947 టు టుడే' గ్రంథం 75 ఏండ్ల భారత ప్రస్థానంపై ఒక సాధికారిక వ్యాఖ్యానం. స్వాతంత్ర్యానంతరం ఎన్నో ఆశలతో జీవితాలు మెరుగుపడుతాయని ఆశించిన భారతీయులను వరుస ప్రభుత్వాలు ఏ విధంగా నిరాశకు గురి చేశాయో ఈ పుస్తకంలో ఆయన విశదీకరించారు. మరీ ముఖ్యంగా, మోదీ ప్రధాని అయిన తర్వాత భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎలా కుప్పకూలిందో, న్యాయ, మీడియా రంగాలు ఎలా అణచివేతకు గురయ్యాయో తెలిపారు. భారతదేశంలో ప్రజాస్వామ్యమే ఉనికిలో లేకుండా పోయిందని, భారత్ 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' (ఎన్నికలు జరిగే నియంతృత్వ రాజ్యం)గా మారిపోయిందని విశ్లేషించారు. ఈ పుస్తకంలోని కొన్ని భాగాలు ఢిల్లీలో అధికారం చేపట్టిన పార్టీలు అనుసరించిన అపసవ్య విధానాల వల్ల దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోయాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ప్రజలు ముఖ్యంగా యువత అసంతృప్తితో రగిలిపోయింది. ఇటువంటి సమయంలో 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ఈ పరిస్థితులకు హిందుత్వను జోడించారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. ఆ ఏడాది మే నెలలో ప్రధానమంత్రి పదవిని మోదీ అధిష్ఠించారు. మరుసటి నెలలోనే మూకదాడులు మొదలయ్యాయి. పుణెలో ఒక ముస్లిం సాఫ్ట్‌వేర్ నిపుణుడిని.. ఫేస్‌బుక్‌లో రెచ్చగొట్టే వీడియో పెట్టాడని ఆరోపిస్తూ ఒక మూక కొట్టి చంపింది. మరోవైపు, హిందుత్వ డిజిటల్ సైనికులు తమ కార్యకలాపాలను ఉధృతం చేశారు. వాజపేయి హయాంలో మంత్రిగా పని చేసి, అనంతర కాలంలో మోదీ, షాల విమర్శకుడిగా మారిన అరుణ్‌శౌరీనీ వారు వదల్లేదు. దివ్యాంగుడైన ఆయన కుమారుడిపై సోషల్ మీడియాలో తిట్లు కురిపించారు. కర్ణాటకకు చెందిన ప్రముఖ మేధావి, హిందుత్వ రాజకీయాల విమర్శకుడైన ఎంఎం కల్బుర్గిని ఆగస్టు 2015లో ధార్వాడ్‌లోని ఆయన ఇంటిలోనే హత్య చేశారు. అక్టోబర్‌లో ఢిల్లీ శివార్లలోని గ్రేటర్ నోయిడాలో ఆవు మాంసం తిన్నాడని ఆరోపిస్తూ ఒక ముస్లింను చంపారు. దేశ తొలి హోంమంత్రి వల్లభాయ్ పటేల్‌ను హిందుత్వ సిద్ధాంతకర్తగా అభివర్ణించే ప్రయత్నం పెద్ద ఎత్తున మొదలైంది. నిజానికి, పటేల్ నికరమైన గాంధేయవాది. జీవితాంతం గాంధేయ విలువలైన అహింస, సహనం పాటించారు. మైనారిటీలైన ముస్లింల పట్ల ఆయన ఏనాడూ వివక్ష చూపలేదు. అటువంటి పటేల్‌ను హిందుత్వ సానుభూతిపరుడిగా చిత్రీకరించటం అంటే, చరిత్రను పూర్తిగా వక్రీకరించటమే. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజులకే, ఐక్యతా విగ్రహం పేరుతో ప్రపంచంలోనే అతిపెద్దదైన 182 అడుగుల పటేల్ విగ్రహం ఏర్పాటుకు మోదీ చర్యలు చేపట్టారు. రూ. 3,300 కోట్ల వ్యయంతో ఆ విగ్రహం 2018 నాటికి పూర్తయ్యింది. విగ్రహం ప్రారంభోత్సవాన్ని హిందూ సంప్రదాయ పద్ధతిలో మోదీ నిర్వహించారు. విగ్రహ ఏర్పాటు కోసం అక్కడి నుంచి తరలింపునకు గురైన స్థానికులు తమకు పునరావాస పరిహారం తగినంత ఇవ్వలేదని నిరసన తెలుపుతుంటే, వారిని పోలీసులు అడ్డుకున్నారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో 2017 మార్చిలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. 44 ఏండ్ల వయసున్న యోగి ఆదిత్యనాథ్ సీఎం పదవిని చేపట్టారు. హిందుత్వ శ్రేణులు ఆయనను 'హిందూ సింహం'గా అభివర్ణించాయి. నిజంగానే, విద్వేష హిందూ రాజకీయాల్లో ఆయనది అందెవేసిన చేయి. 1998లో ఆదిత్యనాథ్




'గో రక్ష మంచ్' ను ప్రారంభించారు. ఆవుల రక్షణ అనే అంశం మతపరమైన చీలికలు తీసుకురావటానికి పెద్దగా ఉపయోగపడటం లేదని గ్రహించి, 2002లో హిందూ యువవాహినిని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఏకైక ఎజెండా, ముస్లింలు హిందువుల శత్రువులని ప్రచారం చేయటం, ముస్లింలపై హిందువుల్లో ద్వేషాన్ని రేకెత్తించటం. ఈసారి ఆదిత్యనాథ్ తంత్రం ఫలించింది. ఆయన స్వస్థలం, యూపీలోని అనేక వెనుకబడిన పట్టణాల్లో ఒకటైన గోరఖ్‌పూర్‌లో మతపరమైన అల్లర్లు, దొమ్మీలు తరచూ చోటుచేసుకోవటం మొదలైంది. ఈ విధంగా రాజకీయాల్లో ఎదిగిన ఆదిత్యనాథ్, యోగిగా పేరొంది, ఆ తర్వాత సీఎం అయ్యారు. యూపీలో దశాబ్దాలుగా ఉన్న 'నేరస్థులు–రాజకీయ నేతల కూటమి' అనే సంప్రదాయాన్ని యోగి కొనసాగించారు. రాష్ట్రాన్ని ఈ సంప్రదాయం భ్రష్టుపట్టించింది. అయినా, యోగి దానిని ముందుకు తీసుకెళ్లారు. ఆయన క్యాబినెట్‌లో దాదాపు సగం మందిపై తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలున్నాయి. స్వయంగా యోగిపైనే.. హత్యాయత్నం, విధ్వంసం, అల్లర్లు, బెదిరింపులకు పాల్పడటం వంటి కేసులు అప్పటికే నమోదై ఉన్నాయి. దేశవ్యాప్తంగా తన విమర్శకుల నోళ్లను మందబలంతో మూయించటంలో హిందుత్వ విజయం సాధించింది. 2017 జూలైలో బెంగళూరులో ప్రముఖ జర్నలిస్టు, సామాజిక ఉద్యమకారిణి గౌరీ లంకేశ్‌ను ఆమె ఇంటి ముందే ఇద్దరు దుండగులు తుపాకితో కాల్చి చంపారు. ఆమె హత్యను హిందుత్వ శ్రేణులు ట్విట్టర్‌లో పండుగలా జరుపుకొన్నాయి. ఆ శ్రేణుల్లో నిఖిల్ దడిచ్ ఒకరు. 'గౌరీలంకేశ్ కుక్క చావు చచ్చింది. ఇతరులకూ అదే గతి పడుతుంది' అంటూ నిఖిల్ ట్వీట్ చేశాడు. ఆయనను ట్విట్టర్‌లో ఫాలో అయ్యే వాళ్లలో ప్రధాని నరేంద్రమోదీ కూడా ఒకరు. హిందుత్వ శక్తులు నూతనోత్సాహంతో చరిత్రకు కొత్త వ్యాఖ్యానాలు చేయటం ప్రారంభించాయి. దీనికి ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. తాను ప్రధాని అయిన ఐదు నెలలకు 2014 అక్టోబర్‌లో జరిగిన ఓ వైద్యుల సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రాచీన భారతదేశంలో వైద్యపరంగా అనేక అద్భుతాలు జరిగాయని చెబుతూ, కర్ణుడు తల్లి గర్భం నుంచి జన్మించలేదని, ఇది నాటి జన్యుశాస్త్ర అభివృద్ధికి నిదర్శనమన్నారు. వినాయకుడికి ఏనుగు తొండాన్ని అమర్చటం నాటి ప్లాస్టిక్ సర్జరీకిఉదాహరణ అని చెప్పారు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రప్రభుత్వాలు చరిత్ర పుస్తకాల్లోని పాఠ్యాంశాలలో మార్పులు మొదలుపెట్టాయి. మధ్యయుగాల నాటి ముస్లిం పాలకుల తాలూకు అంశాలను తొలగించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో నెహ్రూ పోషించిన పాత్రను మోదీ విమర్శించారు. దీంతో నాడు బీజేపీ పాలనలో ఉన్న రాజస్థాన్‌లో 8వ తరగతి పుస్తకం నుంచి నెహ్రూకు సంబంధించిన అంశాలన్నింటినీ తొలగించి వేశారు. 2018 జనవరి 1న పశ్చిమ మహారాష్ట్రలోని ఓ చిన్న గ్రామం భీమా కోరేగావ్‌లో జరుగుతున్న దళితుల విజయోత్సవాలపై హిందుత్వ సంస్థలు దాడి జరిపాయి. 200 ఏండ్ల కిందట అదే రోజున అక్కడ జరిగిన యుద్ధంలో బ్రాహ్మణుడైన పీష్వా మహారాజు సైన్యంపై దళితులతో కూడిన బ్రిటీష్ రెజిమెంట్ విజయం సాధించింది. తరతరాలుగా తమను కులం పేరుతో అణగదొక్కిన వారిపై విజయానికి గుర్తుగా దళిత సంఘాలు అక్కడ విజయోత్సవాలు నిర్వహిస్తుంటాయి. కానీ, మోదీ ప్రధాని అయిన తర్వాత ఇది హిందుత్వ శక్తులకు కంటగింపుగా మారింది. దానిపై దాడి జరిపారు. దళితుల అభ్యున్నతి పట్ల సానుభూతి ఉన్న ఐదుగురిని నక్సలైట్ల పేరుతో పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాని మోదీని హత్య చేసి, ఆయన ప్రభుత్వాన్ని కూల్చటానికి వారు కుట్ర పన్నారని అభియోగం మోపారు. విచారణ వేగంగా జరుగకుండా, కనీసం బెయిల్ కూడా రాకుండా వారిపై నల్లచట్టం ఉపాను మోపారు. నేటికీ ఈ కేసు వారిపై కొనసాగుతున్నది. 2019 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పూర్తి నిరాశజనకంగా ఉంది. జీడీపీ వృద్ధి రేటు పడిపోతూనే ఉన్నది. నిరుద్యోగం పెచ్చరిల్లింది. ముఖ్యంగా, ఒక ప్రణాళిక అంటూ లేకుండా తీసుకొచ్చిన నోట్లరద్దు, జీఎస్టీ వల్ల ఉద్యోగాల మీద పెద్ద దెబ్బ పడింది. ఆ ఏడాది మార్చిలో వాషింగ్టన్‌కు చెందిన 'ప్యూ రీసెర్చ్ సెంటర్' భారత్‌లో జరిపిన సర్వేలో పాల్గొన్న వారిలో 76 శాతం మంది ఉద్యోగావకాశాలు లేకపోవటమే తమ అతి పెద్ద సమస్య అని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు మరికొన్ని నెలల వ్యవధి మాత్రమే ఉంది. ఐదేండ్ల కాలంలో మోదీ చెప్పుకోదగిన విజయాలు ఏమైనా ఉన్నాయా అంటే, ఒకటి, స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద మరుగుదొడ్ల నిర్మాణం, రెండు.. పేదలకు సబ్సిడీపై వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ. దేశవ్యాప్తంగా 10 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని మోదీ చెప్పుకొన్నారు. వీటివల్ల దేశంలో పారిశుద్ధ్యం మెరుగుపడిన మాట వాస్తవమే. అయితే, స్వతంత్ర అధ్యయనాల వల్ల తెలిసిందేమిటంటే, తొందరగా నిర్మించాలన్న ఆత్రుతతో మరుగుదొడ్లను అడ్డదిడ్డంగా కట్టారు. అనేక చోట్ల నీటి సదుపాయం కల్పించలేదు. కొన్ని కూలిపోయాయి. మరికొన్ని వినియోగించుకోవటానికి వీల్లేకుండా తయారయ్యాయి. చాలాచోట్ల డ్రైనేజీతో కలుపకపోవటం వల్ల, వ్యర్థాలు భూగర్భ జలాల్లో కలిశాయి. బహిరంగ మల విసర్జన నేటికీ పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. మరో విషయం ఏమిటంటే, భారతదేశంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చటంలో, మరుగుదొడ్ల నిర్మాణం అన్నది ఒక అంశమే కానీ, అదే పూర్తి పరిష్కారం కాదు. నదుల్లో కాలుష్యం, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు అలాగే ఉన్నాయి. నమామి గంగే పేరుతో గంగానది ప్రక్షాళన కోసం మోదీ చేపట్టిన ప్రాజెక్టు కూడా ఫలితాలను ఇవ్వలేదు. పర్యాటకులు ఎక్కువగా సందర్శించే ప్రాంతాలను మాత్రమే ఈ ప్రాజెక్టులో భాగంగా మెరుగుపరిచారు. అంతేగాని, ఆ నదిలోకి భారీ ఎత్తున వచ్చి పడుతున్న పారిశ్రామిక, మానవ వ్యర్థాలను అడ్డుకోలేదు. వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం కింద, సిలిండర్లను, గ్యాస్ స్టవ్‌ను సబ్సిడీతో మహిళలకు అందించారు. కట్టెల పొయ్యి పొగ నుంచి మహిళలకు విముక్తి కల్పించి వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి ఈ పథకాన్ని భారీ ప్రచారంతో ప్రారంభించారు. కానీ, పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరల కారణంగా, కొత్త సిలిండర్‌ను తీసుకోవటం కోట్లాదిమంది నిరుపేద మహిళలకు భారమయ్యింది. ఖాళీ సిలిండర్‌ను పక్కన పెట్టారు. కట్టెల పొయ్యే వారికి మళ్లీ దిక్కయ్యింది. ఈ విధంగా, ఎన్నికల సమయానికి ఈ రెండు పథకాలతో ఇక ఓట్లు రావని అర్థమైంది. దీంతో హిందుత్వతో కూడిన జాతీయవాదం తెరపైకి వచ్చింది. 2019 ఫిబ్రవరి 14న కశ్మీర్‌లో సైనికుల కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి జరిగింది. 40 మంది జవాన్లు మరణించారు. దేశానికి చౌకీదార్‌ను అని చెప్పుకున్న మోదీ, ఈ దాడికి ప్రతిగా పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి నిర్వహించారు. అయితే, ఆ ప్రాంతాన్ని సందర్శించిన జర్నలిస్టులకు అక్కడ వైమానిక దాడి జరిగిన ఆనవాళ్లేమీ కనిపించలేదు. అయినప్పటికీ, భారతదేశంలో సోషల్‌మీడియాలో జాతీయవాద ప్రచారం పెద్ద ఎత్తున మొదలైంది. 12 లక్షల మంది బీజేపీ సోషల్ మీడియా వలంటీర్లు ఈ ప్రచారాన్ని ముందుండి నడిపించారు. ఓ వీడియోగేమ్ నుంచి తీసుకున్న క్లిప్‌ను, పాకిస్థాన్ మీద భారత్ జరిపిన వైమానిక దాడిగా సృష్టించారు. దీనికి తోడుగా అదే నెలలో జరిగిన కుంభమేళాలో యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. అండమాన్ జైలులో సావర్కర్‌ను నిర్బంధించిన గదిని మోదీ సందర్శించారు. అక్కడున్న సావర్కర్ ఫొటో ముందు ధ్యానముద్రలో కూర్చున్నారు. ఆ ఫొటోను మోదీనే స్వయంగా ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 2014 ఎన్నికల నాటి ఆర్థికాభివృద్ధి హామీ, గుజరాత్ మాడల్ వంటివన్నీ కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో, పాకిస్థాన్‌ను ఎదుర్కోగల దీటైన నేత మోదీ అనే ఇమేజీ, హిందుత్వ వచ్చి చేరాయి. బీజేపీ సోషల్ మీడియాలో కీలక బాధ్యతలు నిర్వహించి, ఆ పార్టీపై భ్రమలు తొలగిన తర్వాత బయటకు వచ్చిన ఒక వ్యక్తి.. '2014 ఎన్నికలు అభివృద్ధి ఎజెండాగా జరిగితే, 2019 ఎన్నికలు మతవిద్వేషాల ఆధారంగా జరిగాయి' అని వ్యాఖ్యానించటం పరిస్థితికి అద్దం పట్టింది. ఎన్నికలు దగ్గర పడిన ఏప్రిల్, మే నెలల నాటికి సోషల్ మీడియాలో విద్వేష ప్రచారం జోరందుకున్నది. వాట్సాప్, ఫేస్‌బుక్ కొన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ ఆర్ఎస్ఎస్‌కు, సీనియర్ బీజేపీ నేతలకు మినహాయింపునిచ్చాయి. ముఖ్యంగా, ఫేస్‌బుక్ ద్వారా పెద్ద ఎత్తున విద్వేష ప్రచారం జరిగిందని ఫేస్‌బుక్ అంతర్గత నివేదికలే వెల్లడించాయి. ఫ్రాన్స్ హాగెన్ అనే విజిల్ బ్లోయర్ ఈ విషయాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల ఖర్చు అమెరికా అధ్యక్ష ఎన్నికలను మించిపోయింది. లోక్‌సభ ఎంపీల్లో ఎన్నడూ లేని విధంగా 29 శాతం మందిపై హత్య, కిడ్నాప్, డబ్బు వసూళు వంటి సీరియస్ క్రిమినల్ కేసులున్నాయి. అంటే ప్రతి నలుగురిలో ఒకరికన్నా ఎక్కువ మందిపై. బీజేపీలో కూడా ఇదే వరుస. ఆ పార్టీ నుంచి ఎన్నికైన ఎంపీల్లో 29 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 2017లో మోదీ సర్కారు ఎలక్టోరల్ బాండ్లు అనే కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది. తమకు ఇష్టం ఉన్న రాజకీయ పార్టీకి వ్యక్తులుగానీ, సంస్థలుగానీ ఎంతైనా నిధులను అందజేసే విధానం ఇది. విరాళాలు ఇచ్చిన వ్యక్తులు తమ వివరాలను బయటపెట్టటం తప్పనిసరేమీ కాదు. ఎన్నికల సంఘమే స్వయంగా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. కానీ, కోర్టు ఏమీ తేల్చలేదు. ఫలితంగా, బీజేపీ లాభపడింది. సదరు బాండ్ల వల్ల వచ్చిన నిధుల్లో 95 శాతం బీజేపీకే వెళ్లాయి. డబ్బుల కోసం మరో మార్గం.. షెల్ కంపెనీలు. ఎక్కడా అడ్రస్ లేని ఈ కంపెనీల ద్వారా రాజకీయ పార్టీలకు, నేతలకు డబ్బు ప్రవహించింది.

# చరిత్రలో నిలిచిన అమ్మ..

కూకట్‌పల్లి 23 మే ప్రజా పాలన ప్రతినిధి: కాల గమనంలో ఆరు సంవత్సరాలనేది కాస్త దీర్ఘమైనదే అనుకోవచ్చు. ఎన్నో సంతోషకర సంఘటనలు ఎదురుకావచ్చు , మరెన్నో విషాదఘటనలు చోటు చేసుకొని వుండొచ్చు. వీటన్నింటి మధ్య ఓ సందర్భం, ఆరు సంవత్సరాలు



నిర్విఘ్నంగా తన స్థానాన్ని ప్రాధాన్యతను నిలబెట్టుకోవడమే కాదు. ఇంకా ప్రాశస్త్యం పెంచుకుంటూ పోవడం అంటే చిన్నమాట కాదు. ఆ సందర్భం ఏమంటే ఒక కొడుకు జన్మ యిచ్చిన తల్లి శాశ్వతంగా దూరం కావడాన్ని చరిత్రగా మార్చడం. చరిత్రలో నిలిచిన అమ్మ కుసుమ కమల రత్నం, కొడుకు కుసుమ భోగరాజు. తల్లి మరణానంతరం వారి పేరు మీద సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకొని కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ (కేకేఆర్ఎం ట్రస్ట్) పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలుగా అలుపెరుగని సేవా కార్యక్రమాలలో నిమగ్నమై వున్నారు. మే 23 అమ్మ కమలరత్నం 7వ వర్ధంతి. ఈ సందర్భంగా కేకేఆర్ఎం ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ డా.కుసుమ భోగరాజు మియాపూర్ మయూరి నగర్ లో గల ఆశ్రేయ వృద్ధాశ్రమంలో నిరుపేదలైన వృద్ధ మహిళలకు, బండారు సుబ్బారావు, సీల్ వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నూతన వస్త్రాల పంపిణీతో పాటు వారికి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అనెదల ఆనందరావు మద్దెల శివకుమార్ మరియు దారు పల్లి అనిల్ తదితరులు హాజరయ్యారు.

# మరో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఆందోళన

## నిన్న రెడ్డి శాంతి...ఇవాళ కిరణ్


శ్రీకాకుళం, మే 23,:శ్రీకాకుళం జిల్లా అధికార పార్టీలో అసమ్మతి రాగం ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. నిన్నటికి నిన్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి వద్దు.. జగనన్న ముద్దు అంటూ నల్లబ్యాడ్జీలు ధరించి ఆమెకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అధికార పార్టీలో ఓ వర్గం ఆందోళనకు దిగింది. ఇది చల్లారక మునుపే ఎప్పటి నుంచో చాపకింద నీరులా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ పై వ్యతిరేకత ఒక్కసారిగా భగ్గుమంది. ఆ సెగ్మెంటు నుంచి శ్రీకాకుళం నగరం వరకు ఈ గ్రూపుల గోల పాకింది. నగరంలోని పీఎన్ కాలనీకి సమీపంలో గల కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కిరణ్‌కు వ్యతిరేకంగా అసమ్మతి వాదులు సమావేశం నిర్వహించి, రానున్న ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ బహిరంగంగానే సవాల్ విసరడం హాట్ టాపిక్ గా మారింది.ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెలరేగిన వివాదం తారాస్థాయికి చేరింది. అప్పటి నుంచి కిరణ్ కు వ్యతిరేకంగా వైసీపీ సీనియర్ నాయకులు బల్లాడ జనార్ధన్ రెడ్డి, జరుగుళ్ల శంకర్ తో పాటు మరికొంత మంది గతంలో లావేరులో రహస్య సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేపై తిరుగుబాటు ప్రదర్శించారు. దీనిపై ఆ పార్టీలో ప్రముఖులైన విజయసాయిరెడ్డి, విజయ నగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ రెడ్డి



ఓదార్చడంతో కాస్త సద్దుమణిగిందనుకున్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గం ఆదివారం ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరం వరకూ భారీ ర్యాలీ చేపట్టింది. వందలాది మంది తరలిరావడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఏం జరుగుతోందని అందరూ చర్చించుకుంటున్నారు. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో కలకలం రేపుతోంది. నాయకుల మధ్య అంతర్గత పోరుతో నలిగిపోతున్న తరుణంలో ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణితో వర్గపోరు తీవ్రమైందని ఓ వర్గం బాహాటంగానే విమర్శిస్తోంది. వైసీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పై కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని అదే పార్టీ నేతలు బహిరంగ విమర్శలు దిగుతున్నారని అన్నారు.ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో సొంత పార్టీ నుంచి అసమ్మతి స్వరాలు వినిపించడంతో ఎమ్మెల్యే వర్గీయులు, సీనియర్ నేతలు కంగుతిన్నారు. వైసీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వైఖరిపై ఆగ్రహంతో నియోజకవర్గంలో ఆయన పని తీరుపై సర్వే చేయించిందని టాక్ లేకపోలేదు. అటు పాత పట్నం ఎమ్మెల్యేపై ఎలా ఓవర్గం తిరుగుబాటు చేశారో ఎచ్చెర్లలో కూడ అదే విధంగా రోడ్డెక్కడంతో ఆయా ఎమ్మెల్యేలలోనే కాకుండా అధికార పార్టీ నేతల్లో కూడ చర్చనీయాంశమైంది. ఇంటా, బయటా అసమ్మతితో ఇబ్బంది పడుతున్న ఎమ్మెల్యేలు, గొర్లె కిరణ్, రెడ్డి శాంతిలకు అభద్రతా భావం మొదలైందని చెప్పక తప్పదు. కొంతమంది ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, పార్టీ పదవులలో కొనసాగుతున్న వారే నేరుగా ఢీ కొట్టేందుకు సై అంటున్నారు. ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తుండడంతో రానున్న రోజుల్లో దీని ప్రభావం మరింత తీవ్రతరంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ పై సొంత పార్టీలోనే అసమ్మతి వెల్లువెత్తింది. ఎమ్మెల్యే మాకొద్దంటూ అసమ్మతి నాయకు ఆదివారం రోడ్డెక్కారు. జగన్ ముద్దు.. ఎమ్మెల్యే వద్దంటూ గొర్లె కిరణ్ కి వ్యతిరేకంగా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వరకు హైవే మీదుగా కొనసాగింది. జగన్ రావాలి.. కిరణ్ పోవాలి, జగన్ ముద్దు.. కిరణ్ వద్దు, టిక్కెట్ కిరణ్‌కు వద్దు.. వేరే ఎవరికైనా సై.. అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది. ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను అసమ్మతివాదులు పట్టుకుని ర్యాలీలో ముందుకుసాగారు. అవినీతి ఎమ్మెల్యేను రానున్న ఎన్నికల్లో గద్దె దింపుతామని సీనియర్ నాయకులతో పాటు కొందరు సర్పంచ్ లు, ఎంపీటీసీలు హెచ్చరించారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారుఎమ్మెల్యే అయిన తరువాత ఆయన వ్యక్తిగత ప్రయోజనాలకు పాటుపడుతున్నారే తప్ప పార్టీ అభివృద్ధికి శ్రమించడం లేదన్నారు. ఆయన తీరుతో సీఎం జగన్మోహన్ రెడ్డికి మచ్చ మిగులుతుందన్నారు. పార్టీకి నష్టం చేస్తుండడంతో ఇక భరించలేక రోడ్కెక్కామన్నారు. వలంటీర్లను పెడితే అక్కడ కూడ అడ్డుకున్నారని, తన ఇంటి పేరు ఉందని ముగ్గురిని తీసేశారన్నారు. ఈ విషయం మంత్రి సత్తిబాబు దృష్టిలో పెట్టామని తెలిపారు. ఆయన జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయిందన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని కాదంటే ఎట్టి పరిస్థితిలో ఆయన వద్ద ఊడిగం చేయలేమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ను వ్యతిరేకిస్తూ ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం నగరం వైపు వస్తున్న బైక్ ర్యాలీని ఎచ్చెర్ల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం నిర్వహించే ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ అక్కడ ఎస్ఐ హైవేపై అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని వైసీపీ సీనియర్ నేతలు బల్లాడ జనార్ధన్ రెడ్డి, శంకర్ పోలీసులకు వివరించినప్పటికీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే కొందరు బైక్ లపై నగరంలోకి జారుకున్నారు. శ్రీకాకుళం నగరంలో ఎవరూ అడ్డుకోకపోవడంతో పీఎన్ కాలనీ సమీపంలో గల పంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కిరణ్ పై తిరుగు బాటు సమావేశం యథావిధిగా నిర్వహించారు.

# విద్యా విధానంతోనే ముందడుగు

దేశంలో జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయి లో ఎస్‌సిఆర్‌టి ఉన్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి, వారి తరగతిని బట్టి సబ్జెక్టు లో అనుభవం కలిగిన, నిష్ణాతులైన వారి చేత పాఠ్య పుస్తకాలను రూపొందించి జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి పుస్తకాలను ఒకటి నుండి 10వ తరగతి వరకు అమలు చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా పాఠశాల స్థాయిలో పుస్తకాలను రూపొందించి తమ స్వీయ ఎజెండా అమ లు చేస్తున్నారు. 10వ తరగతిలో పబ్లిక్ ఎగ్జామ్స్ ఉన్నందున అనేక ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను చదివించకుండా కేవలం ప్రశ్న జవాబులను మాత్రమే చదివిస్తూ విద్యార్థులకు మంచి గ్రేడింగ్ రావడానికి ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులకు మార్కులు, గ్రేడింగ్ విధానంపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలోని విద్యా విధానంలో వివిధ మేనేజ్‌మెంట్లు ఉండడం వల్ల విద్యా విధానం గందరగోళంగా మారుతున్నది. దేశ వ్యాప్తంగా కామన్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. దేశ వ్యాప్తంగా ఒకేసారి పరీక్షలు నిర్వహించడం, ఒకేసారి ఫలితాలు ప్రకటించడం, ఒకేసారి ఉన్నత చదువులు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుత విద్యా విధానంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఎయిడెడ్, కార్పొరేట్, మైనారిటీస్, మోడల్ స్కూల్, పబ్లిక్ స్కూల్‌లు, నవోదయ స్కూళ్ళు, కేంద్రీయ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఎస్‌సి గురుకులాలు, ఎస్‌టి గురుకులాలు, బిసి గురుకులాలు, తెలంగాణ రాష్ట్ర గురుకులాలు, స్పోర్ట్స్ స్కూల్‌లు, మిలిట్రీ స్కూల్, సైనిక్ స్కూల్‌లు, ప్రైవేటు స్కూల్‌లు,




అనేకం ఉన్నాయి. భారతీయ విద్యా విధానంలో త్రి భాషా సూత్రాన్ని అమలు చేస్తున్నారు. ప్రథమ భాషగా మాతృభాష, ద్వితీయ భాషగా హిందీ, తృతీయ భాషగా ఇంగ్లీష్ అనేక పాఠశాలల్లో త్రి భాషా సూత్రం పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాతృభాష తెలుగును తప్పని సరిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది. 10వ తరగతి వరకు తెలుగును తప్పని సరిగా అభ్యసించాలనే నియమ నిబంధనలు రూపొందించినది. అనేక పాఠశాలల్లో ప్రభుత్వ ఉత్తర్వులను ఏమాత్రం ఖాతరు చేయకుండా 10వ తరగతి వరకు తెలుగు చదవకుండానే పదవ తరగతి పూర్తి చేస్తున్నారు. తెలుగుకు బదులుగా సంస్కృతం, రష్యన్, ఫ్రెంచ్, చైనీస్ మిగతా భాషలను చదువుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో 10వ తరగతి వరకు తెలుగు భాషను అమలు చేయని పాఠశాలలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్త ధోరణి, అవినీతి వలన ప్రైవేటు పాఠశాలల్లో ఆడిందే ఆటగా మారింది. జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి ఉన్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి, వారి తరగతిని బట్టి సబ్జెక్టులో అనుభవం కలిగిన, నిష్ణాతులైన వారి చేత పాఠ్య పుస్తకాలను రూపొందించి జాతీయ స్థాయిలో ఎన్‌సిఆర్‌టి, రాష్ట్ర స్థాయిలో ఎస్‌సిఆర్‌టి పుస్తకాలను ఒకటి నుండి 10వ తరగతి వరకు అమలు చేయాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా పాఠశాల స్థాయిలో పుస్తకాలను రూపొందించి తమ స్వీయ ఎజెండా అమలు చేస్తున్నారు. 10వ తరగతిలో పబ్లిక్ ఎగ్జామ్స్ ఉన్నందున అనేక ప్రైవేటు పాఠశాలలు పాఠ్యపుస్తకాలను చదివించకుండా కేవలం ప్రశ్న జవాబులను మాత్రమే చదివిస్తూ విద్యార్థులకు మంచి గ్రేడింగ్ రావడానికి ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులకు మార్కులు, గ్రేడింగ్ విధానంపై మాత్రమే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. విద్యార్థుల మానసిక, భౌతిక విషయాలపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. 10వ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ తరువాత ఇంటర్మీడియట్, ఆ తర్వాత జరగనున్న ఐఐటి కోసం 3, 4వ తరగతి నుండే ఐఐటి బోధన పేరిట విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు.పబ్లిక్ స్కూళ్లలో, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతి సంవత్సరం ఫీజులను తమకు ఇష్టానుసారం పెంచుకుంటుపోతున్నాయి. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఫీజుల భారం ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో ఫీజులను ఖరారు చేసింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను ఖాతరు చేయకుండా అధిక మొత్తాల్లో ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. విద్య వ్యాపార సంస్థగా మారింది. జాతీయలో, రాష్ట్ర స్థాయిల్లో అధికారులు పిల్లలు, నాయకుల పిల్లలు, పేద, మధ్య తరగతి ప్రజల పిల్లలు చదవడానికి కామన్ విద్యా విధానంను అమలు చేయాలి. జాతీయ స్థాయిలో కేంద్ర కేబినెట్ 2023-24 విద్యా సంవత్సరానికి ఆమోదించిన 1+5+ 3+4 విద్యా విధానం అన్ని పాఠశాలల్లో అమలు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ టీచర్‌లు, ఎయిడెడ్ టీచర్లు, ప్రైవేటు టీచర్‌లు, విద్యా వాలంటీర్లు, కాంట్రాక్టు టీచర్లు, గురుకుల పాఠశాలల టీచర్లు, మోడల్ స్కూల్ టీచర్‌లు అంటూ వేరువేరు పేర్లతో పిలుస్తున్నారు. ఉపాధ్యాయుల కనీస సమస్యలను పరిష్కరించడం లేదు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సర్వీస్ నిబంధనలు సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా సంబంధిత అధికారులు జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కామన్ విద్యా విధానంపై దృష్టిని కేంద్రీకరించి విద్యా వ్యాపారంను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జూన్ 30వరకు ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో మార్పులు



తిరుమల, మే 23, :తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30 వరకు ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో మార్పులు చేసినట్లు ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. సర్వదర్శనానికి సుమారు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. దీంతో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం ఆర్జితసేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు టీటీడీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. కోవిడ్ ముప్పు పూర్తిగా తొలగిపోవడం, వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్యభక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామివారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్టు టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేసినట్లు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. దీంతో 20 నిమిషాల సమయం ఆదా అవుతుందన్నారు. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహిస్తామన్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుందని తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదని స్పష్టం చేశారు. కేవలం స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామని తెలిపారు. దీని వల్ల ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుందన్నారు. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం అవుతుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు, వీఐపీలు సహకరించాలని టీటీడీ ఛైర్మన్ వైవీ. సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.టీటీడీ శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్ చెప్పింది. జులై, ఆగస్టు నెలల కోటా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఈనెల 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. బుధవారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ టికెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. ప్రతి నెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల లక్కీ డిప్ కోసం భక్తులు నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు లక్కీ డిప్ లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. తిరుమల శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, గదుల కోటా వంటి టికెట్లు కోసం భక్తులు ఎదురు చూడాల్సిన పనిలేకుండా, ఇకపై ప్రతి నెలా నిర్ణీత తేదీల్లోనే తర్వాతి నెలలకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్ లో విడుదల చేయనున్నట్లు టీటీటీ తెలిపింది.

## నేడు అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవం

మే 24వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈరోజు అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవం. ప్రతి సంవత్సరం ఫాదర్స్, మదర్స్ డే, లవర్స్ డే మాదిరి బ్రదర్స్ డే ను ప్రపంచ దేశాలు నిర్వహించుకుంటున్నాయి. సోదరుడు అంటే అన్నాతమ్ముడు ఎవరైనా కావొచ్చు. మనతో ఆత్మీయంగా స్నేహితుడి మాదిరి ఉండే వ్యక్తి సోదరుడు. సోదరులు ఉంటే రక్త సంబంధమే కాదు. మనతో ఆత్మీయంగా ఉండే స్నేహితులను కూడా సోదరులుగా భావించవచ్చు. వారికి కూడా విషెస్ చెప్పొచ్చు. అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే 24న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా మరియు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో అంతర్జాతీయ బ్రదర్స్ డే జరుపుకుంటారు. అయితే ఈ బ్రదర్స్ డే ఎందుకు జరుపుకుంటారు. అసలు ఎప్పుడూ ప్రారంభమైందో తెలుసుకుందామా... 2005 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం మే 24న బ్రదర్స్ డే జరుపుకుంటారు. అలబామాకు చెందిన సిరామిక్ కళాకారుడు, శిల్పి, రచయిత సి డేనియల్ రోడ్స్ మొదటగా ఈ రోజును జరుపుకోవడం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10న జరుపుకునే నేషనల్ సిబ్లింగ్స్ డే దినోత్సవం మాదిరిగానే ప్రతి సంవత్సరం మే 24న బ్రదర్స్ డే జరుపుకుంటారు. అయితే మొదట్లో దీనిని కేవలం అమెరికాలో మాత్రమే జరుపుకునేవారు. తర్వాత ప్రపంచంలోని ఇతర దేశాలు కూడా ఈరోజును జరుపుకోవడం ప్రారంభించాయి. కొన్ని దేశాలలో ఈరోజున అధికారిక సెలవు దినంగా పాటిస్తారు. ఈ రోజున సోదరులు పరస్పరం బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. కొన్ని దేశాల్లో వారి సోదరులకు ఇష్టమైనవి వంటకాలు చేసి కలిసి భుజిస్తారు. అన్నాదమ్ములు పరస్పరం తమపై ప్రేమ చాటుకునేందుకు ఉద్దేశించినదే బ్రదర్స్ డే.

## సివిల్స్ లో మెరిసిన అయిలాపూర్ వాసి

**132 వ ర్యాంక్ సాధించిన ఏనుగు శివ మారుతి**



కోరుట్ల, మే 23 ( ప్రజాపాలన ప్రతినిధి ): కోరుట్ల మండలం లోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతి రెడ్డి మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 132 ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్ కోసం ఎంపికయ్యారు. శివ మారుతి తండ్రి ఏనుగు అంజిరెడ్డి మల్లాపూర్ మండలం గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. శివ మారుతి రెండవ ప్రయత్నంలోనే ఈ ర్యాంకు సాధించగా, ఆయన ఐపీఎస్ కు ఎంపిక అయ్యే అవకాశం ఉంది.ఎస్.ఎస్.సీ మెట్ పల్లి నిఖిల్ భరత్ పాఠశాలలో చదివిన శివమారుతి హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివి స్టేట్ ర్యాంక్సాధించాడు. అలాగే ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్డిగ్రీ కళాశాలసో బీ.ఏ ఎకనమిక్స్ లో డిగ్రీ చదివి సివిల్స్ లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు.జాతీయ స్థాయిలో 132 ర్యాంకు సాధించడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు అంజిరెడ్డి -పుష్పలత ,గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా శివ మారుతిని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు ప్రత్యేకంగా అభినందించారు.

## గంగమ్మ గుడి బోరు నిర్మాణానికి యాభై వేల విరాళం



కోరుట్ల, మే 23 ( ప్రజాపాలన ప్రతినిధి):కోరుట్ల మండలం లోని సర్వరాజ్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ గుడికి బోరు నిర్మాణానికి మెట్పల్లీ వాస్తవ్యులు మీనాక్షి హాస్పటల్ వైద్యులు డా,,శ్వేత అమరేశ్వర్ యాభై వేల రూపాయలు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల బీ.అర్.ఎస్.యూత్ అధ్యక్షులు నత్తి రాజు కుమార్,గ్రామ సర్పంచ్ దానవెని సాయమ్మ - మల్లయ్య , నత్తి మహేష్, భూమేష్,గంగారెడ్డి,నర్సయ్య,సతీష్,వెంకన్న,రాములు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



జన్నారం, మే 23, ప్రజాపాలన: పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాళ్ల పేట రేంజ్ అటవీ అధికారి హఫీజోద్దీన్ గ్రామ ప్రజలతో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. గవ్వలు జోన్ పరిధి తాళ్లపేట రేంజ్ పరిధి మల్యాల గ్రామంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ జీవితం ప్రకృతి పరిసరాలతో ముడిపడి ఉందన్నారు. జీవకోటి జంతు, ప్రకృతి పరిసరాలను కాపాడుకుంటే మానవ జీవితం పూలపొన్ను అవుతుందన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు పర్యావరణహిత జీవన విధానం కాపాడాలని కోరారు. ప్లాస్టిక్ వాడడం వల్ల వర్షపు నీరు భూమిలో వినిగిపోనియకుండ చేత భూగర్భ జలాలు తొందరగా అడుగంటి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన బూక్యా జాన్సన్ నాయక్ యువసేన నాయకులు




జన్నారం, మే 23, ప్రజాపాలన: మండలంలోని బూక్యా జాన్సన్ నాయక్ యువసేన నాయకులు మండల కేంద్రంలో చలివేంద్రంన్ని ప్రారంభించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగడి బజార్ ప్రధాన రహదారి ప్రక్కన వేసవి కాలం సమయంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసామన్నారు. ఈ సందర్భంగా రాగుల వెంకటేష్ మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభమై ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో మండల ప్రజలు, చిరు వ్యాపారుల దాహం తీర్చుడానికి భూక్యా జాన్సన్ నాయక్ యువసేన ఆధ్వర్యంలో అంగడి బజారు మార్కెట్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుక్కి జంక్షన్ నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులు, ప్రజలకు సహకారం, అందించడానికి ముందుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫజల్ ఖాన్, సంతోష్, అనిల్, కాశెట్టి మల్లేశ్, మహేష్, రవి చిన్న,రెవెల్లి తిరుపతి, దిరాజ్, అజయ్, ఎనోష్, నరేష్ మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతుల గోస



ఇబ్రహింపట్నం మే తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ దండుమైలారం వద్ద కొనుగోలు కేంద్రాలను కిసాన్ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జక్క రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి రాష్ట్ర నాయకులు పో రెడ్డి నరసింహారెడ్డి కొత్త అశోక్ గౌడ్ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫోర్ రెడ్డి అర్జున్ రెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడడం జరిగింది ముఖ్యంగా రైతులకు జరుగుతున్న తూకంలో కొలతల విషయంలో రెండు మూడు కిలోలు అదనంగా జోక్కోవడం జరుగుతుంది అదేవిధంగా హమాలి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాష్ట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి వసూలు చేయడం జరుగుతుంది హమాలీ రైతుల నుండి వసూలు చేయడం జరుగుతుంది రైతులు కల్లాల్లోకి దాన్యం తీసుకువచ్చి నెలరోజులైనా ఇప్పటికీ ధాన్యం సేకరించడం జరుగుతలేదు ఒకవేళ రైతుల నుండి ధాన్యం సేకరించిన దాన్యంలో తాలు ఉంది అని చెప్పి అదనంగా రెండు కిలోలు జోక్ కోవడం జరుగుతుంది కావున ఈ యొక్క సమస్యలపై రైతుల పక్షాన రంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరుగుతుంది ఈ యొక్క కార్యక్రమంలో కిసాన్ వర్చా మండల అధ్యక్షుడు విఠల్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్ల వెంకటేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు దొండ రమణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొంగ విష్ణువర్ధన్ రెడ్డి, మొగిలి గణేష్, యువమోర్చా మండల అధ్యక్షులు శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాలశివుడు, గంగరములు, సత్యనారాయణ, నరసింహ మహేష్ కానుగుల సత్యనారాయణ అర్జున్, కనుగుల చంటి, ఇబ్రహీం, దాసరి రవి, తదితరులు పాల్గొన్నారు

## 25 న యాదవ, కురుమ సంఘాల జె ఎ సి ఆధ్వర్యంలో ఛలో గాంధీ భవన్...

**రేవంత్ రెడ్డి తక్షణమే మంత్రి తలసానికి క్షమాపణ చెప్పాలి...**

**తెలంగాణ యాదవ, కురుమ సంఘాల జె ఎ సి...**



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి): యాదవ, కురుమల ఆత్మగౌరవం దెబ్బ తినేలా రేవంత్ రెడ్డి మాట్లాడటం తగదని,యాదవులంటే బానిసలుగా రేవంత్ రెడ్డి మాట్లాడటం ఆయన అహంకారానికి పరాకాష్ట అన్నారు యాదవ, కురుమ సంఘాల జె ఎ సి నాయకులు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి తలసానికి, యాదవ జాతికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని నేటి వరకు గడువు ఇచ్చామని, ఆయన క్షమాపణ చెప్పకపోతే 25 రోజు ఉదయం పది గంటలకు ఇందిరా పార్క్ వద్ద యాదవుల మహా ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం దున్నపోతులు, గొర్రె పొట్టేళ్ళతో ఛలో గాంధీ భవన్ కార్యక్రమం చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పటి నుండో యాదవులకు వ్యతిరేకంగా వ్యవహారిస్తూనే ఉన్నారన్నారు.బడుగు బలహీన వర్గాల వారంటే అంత నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు.తక్షణమే యాదవ జాతికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. పది రోజుల గడువు ఇచ్చినా క్షమాపణలు చెప్పకపోవడం ఆయన అహంకారానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గొల్ల, కురుమలు 25 వ తేదీన నిరసన తెలుపనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ, కురుమ సంఘాల నాయకులు కడారి అంజయ్య, గోసుల శ్రీనివాస్ యాదవ్,రాజారాం యాదవ్, బైకని శ్రీనివాస్ యాదవ్,ఎల్.గోవర్ధన్ యాదవ్, శ్రీ హరి యాదవ్, మేకల రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫామ్ స్టిచ్చింగ్ చార్జీలను రూ.150 కు పెంచాలి



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):యూనిఫామ్ స్టిచ్చింగ్ చార్జీలను రూ.150 కు పెంచాలని, యూనిఫామ్ లు కుట్టడానికి ఇచ్చిన గడువును రెండు నెలలకు పెంచాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వ ఉచిత దుస్తులు కుట్టే కార్మికులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన యాభై రూపాయల భత్యంతో జత కుట్టించి ఇవ్వడానికి కుట్టుకూలి గిట్టుబాటు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కార్మిక సంఘం అధ్యక్షుడు వి. శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ సీఎం మా గోడును ఆలకించాలని, యూనిఫార్మ్స్ కుట్టేందుకు తగినంత సమయం ఇవ్వాలని అంటూ ప్లాకార్డుల ను ప్రదర్శించారు. ఈ వృత్తిపై ఆధారపడి నాలుగు లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అందర్నీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యూనిఫామ్ కుట్టె సమయాన్ని కూడా పెంచాలని కోరారు. జులై మొదటి వారం వరకు రెండు జతుల దుస్తులను కుట్టిస్తామన్నారు. తమ జీవనోపాధి కోల్పోయే విధంగా ప్రవర్తిస్తే తమకు ఆత్మహత్యలు శరణమన్నారు తమకు ఏదైనా జరిగితే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన బాధిత వహించవలసి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వి. శ్రీనివాస్ రాజు తో పాటు సంఘం గౌరవ అధ్యక్షుడు దశరథ్,వెంకటేశం,సుభద్ర,లక్ష్మీ నారాయణ, రమాదేవి, రజని,మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రైతు సోదరులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

**వ్యవసాయ శాఖ వారి విజ్ఞప్తి**



మధిర మే 23 ప్రజా పాలన ప్రతినిధి:.రైతు సోదరులు లైసెన్స్ కలిగిన అధీకృత విత్తన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.విత్తనాలు కొనుగోలు చేయునప్పుడు రశీదు తప్పక తీసుకోవాలి. రసీదును విత్తన ప్యాకెట్ పై ఉన్న లేబుల్ వివరాలను సరి చూసుకోవాలి. రసీదును పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి.కృత్రిమంగా విత్తన కొరత సృష్టించాలని అడ్వాన్స్ బుకింగ్ చేసుకోమని అనుమతి లేని వ్యక్తులు గ్రామాలలో తిరిగి వివిధ రకాల రాయితీలు, ఆఫర్ లు, గిఫ్ట్ లు అని ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంది. వారి వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు మరియు వారిపట్ల అప్రమత్తంగా ఉండి అలాంటి వారి సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు తెలియజేయగలరు.మిరప లో వైరస్ తట్టుకునే రకాలు మరియు మూడు సంవత్సరాల పంటకాలం ఉన్న రకాలకు సంబంధించి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు సమర్పించలేదు. కావున అవి అమ్మే వారిపట్ల అప్రమత్తంగా ఉండవలసిందిగా విజ్ఞప్తి. నూతన రకాలను సాగు చేసేటప్పుడు నాణ్యత నిర్ధారించుకోకుండా విత్తనాలు కొనుగోలు చేయవద్దు. గుడ్డ సంచులలో విక్రయించే నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేయవద్దు. బీటీ 3 లేదా హెర్బిసైడ్ టోలరెంట్ కాటన్ విత్తనాలు కొనుగోలు చేసినా సాగు చేసినా పర్యావరణ పరిరక్షణ చట్టం ద్వారా శిక్షార్హులు అవుతారని వ్యవసాయ శాఖ వారు తెలియజేశారు.

## మండల పరిషత్ కార్యాలయం నందు సర్వసభ్య సమావేశం



మధిర మీ 23 ప్రజాపాలన ప్రతినిధి: మధిర మండల ప్రజా పరిషత్ మధిర సర్వసభ్య సమావేశం మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మెండెం లలిత మండల పరిషత్ అధ్యక్షుల వారి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, తాసిల్దార్ రాజేష్ మరియు వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యల గురించి సాధారణ సర్వే సమావేశంలో చర్చించడం జరిగింది.

## చెరగని ముద్ర వేసే అభివృద్ధికి చిరునామా ఎన్టీఆర్





మధిర మే 23 ప్రజా పాలన ప్రతినిధి:ప్రజల ప్రభుత్వంగా తన పాలనతో స్వర్గీయ ఎన్.టి.ఆర్ చెరగని ముద్ర వేస్తే..అభివృద్ధికి చిరునామాగా నిలిచిందనీ, మంగళవారం మధిర మండలం ఇల్లూరు గ్రామంలో జరిగిన లిఇంటింటికి తెలుగుదేశంలి కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా వాసిరెడ్డి.రామనాథం,రాష్ట్ర నాయకుడు చేకూరి.శేఖర్ బాబు పాల్గొని ప్రసంగించారు,మండల కో ఆర్డినేటర్ మార్నీడి.పుల్లారావు అధ్యక్షతన దుగ్గినేని.రాజశేఖర్ ఆద్వర్యంలో ముందుగా సభ్యత్వ నమ్మెదు చేపట్టారు,అనంతరం గ్రామ ప్రజలను కలుసుకొన్నారు టి.డి.పి హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కాసాని.జ్ఞానేశ్వర్ నాయకత్వంలో తెలంగాణలో టి.డి.పి తప్పక పూర్వవైభవాన్ని సాధిస్తుందని సామాజిక తెలంగాణ టి.డి.పి తోనే సాధ్యమని పేర్కొంటూ త్వరలో జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మైనీడి.జగన్,ఇల్లూరు ఉప సర్పంచ్ జవ్వాజి,వాణి, కోట.వెంకటేశ్వర్లు, గరికపాటి. సుబ్బారావు,షేక్.ఖాసీంబీ,బి.రాయప్ప తదితరులు పాల్గొన్నారు.


## ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం



శంకరపట్నం మే 23 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలలోని కేశవపట్నం, తాడికల్ రైతు వేదికలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేపడుతున్నారని, అయితే వరి సాగులో చీడపీడల బెడద ఎక్కువ రావడంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రావట్లేదని అందుకే దానికి ప్రత్యామ్నాయంగా రైతులు కొంత విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగుచేపడితే 30 సంవత్సరముల వరకు దిగుబడినిస్తూ రైతుకు మంచి ఆదాయం లభిస్తుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, రైతుసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి - ఎమ్మెల్యే సంజయ్ కుమార్

బీరుపూర్, మే 23 (ప్రజపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల స్థాయి



సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొన్న వారికి ప్రథమ ద్వితీయ స్థానం సాధించిన విజేతలకు నరసింహులపల్లి గ్రామ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే డా: సంజయ్ కుమార్ బహుమతులను క్రీడాకారులకు అందజేసి అభినందించారు. మండలానికి చెందిన 18 మంది ఆడ బిడ్డలకు 18 లక్షల 2వేల రూపాయల కళ్యాణలక్ష్మి చెక్కులను 14 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 14 లక్షల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లారెడ్డి ఎస్సై అజయ్ నారపాక రమేష్ కొలుముల రమణ ముక్క శంకర్ రిక్కల ప్రభాకర్ నల్ల మహిపాల్ రెడ్డి గర్షకుర్తి శిల్పరమేష్ బోడ స్వప్న సిపతి రమేష్ బందెల మరియా ఏనుగుమట్ల హరీష్ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐతో ప్రజల సమస్యలు పరిష్కారం

**తల్లాడ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు..**



తల్లాడ, మే 23 (ప్రజా పాలన న్యూస్): సమాజంలో ప్రతిఒక్కరు సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లాడ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు గారు సూచించారు. మంగళవారం ఖమ్మంజిల్లా తల్లాడ మండలంలోని తెలగవరం గ్రామంలో సమాచార హక్కు చట్టం ఆధ్వర్యంలో గ్రామంలో ఆర్టిఐ పై అవగాహన సదస్సు, మెరిట్ విద్యార్థులకు సన్మానసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ఏ సమస్యనైనా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు చేస్తున్న పనులను వాటి వివరాలను ఈ చట్టం ద్వారా వారం రోజుల్లో తెలుసుకోవచ్చునన్నారు. ఆర్టిఐ చట్టం జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి వెంకటలక్ష్మి, కొరకొప్పు డేవిడ్ మెరిట్ విద్యార్థులకు సన్మానం, సమాచార హక్కు చట్టంపై అవగాహన, సన్మాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావును శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేల్లూరి కృష్ణయ్య, బీఆర్ఎస్ జోనల్ చైర్మన్ మువ్వా మురళి, ఆర్టిఐ జిల్లా కన్వీనర్ అనిల్ కుమార్, మండల కన్వీనర్ ఏపూరి సాయి, బోనకల్ మండల కన్వీనర్ మోహన్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.లి

## ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం

**మండవ కిషోర్ వెంకటలక్ష్మి దంపతులు**



మధిర మే 23 ప్రజాపాలన ప్రతినిధి. :ప్రతి మంగళవారం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వెలగపూడి హనుమంతరావు (పూర్ణ) డాలు కృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. దానిలో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ సబ్సిడీపై ఎల్ఈడి బల్బులు పంపిణీ




మధిర మే 23 ప్రజా పాలన ప్రతినిధి:ప్రభుత్వ సబ్సిడీ పై ఎల్ఈడి బల్బుల పంపిణీ కార్యక్రమం గ్రామీన విద్యుత్ వినియోగదారులకు గొప్ప అవకాశమనీ,మీ గత 3 నెలలలో ఏదైనా ఒక కరెంట్ బిల్లును చూయించి మెరుగైన మరియు మన్నికైన 5 సరికొత్త 12 మరియు 7 వాట్ ల ఎల్ఇడి బల్బులను 3సం? వారంటీతో పొందండి. ఒక్కో బల్బు కేవలం 15 రూపాయలు మాత్రమే( మీ పాత 60%ష% లేదా 100%ష% ల ఎర్ర బల్బు లు మాకు ఇచ్చి ఈ సబ్సిడీ ని పొందగలరు,, ఒక్క మీటరు కు 5 బల్బు లు మాత్రమే ఇవ్వబడును,ఉదయం 7 గంటల నుండి గ్రామ పంచాయతీ ఆఫీస్ నందు మీ యొక్క కరెంటు బిల్లులు కట్టించు కునే దగ్గర ఈ ఎల్ఈడి బల్బుల పంపిణీ ఉన్నది కావున,, 5 బల్బ్ లను 3 సంవత్స రాల వారంటీ తో పొందగలరు , కావున గ్రామస్తు లందరు ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరుచున్నాము.

## బాలల సంరక్షణ కమిటీ ఎన్నిక




మధిర మే 23 ప్రజా పాలన ప్రతినిధి:ఎంపీడీవో సమావేశ కార్యాలయం నందు మహిళ, శిశు , వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖల వారిచే జిల్లా బాలుర పరిరక్షణ విభాగం ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఎంపీపీ మెండెం లలిత అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలస్థాయి బాలుల పరిరక్షణ కమిటీ ఎన్నిక నిర్వహించారు. సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఖమ్మం చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సోనీ ప్రేమ లీనా మాటలాడుతూ సమగ్ర బాలుల సంరక్షణ పథకాలను అందరికీ అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేష్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, డాక్టర్ వెంకటేష్, పృధ్వి, సిడిపిఓ శారద శాంతి, ఎక్స్ఛేంజ్ ఎస్ఐ శర్వాణి , లేబర్ ఆఫీసర్, ఐకెపి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల ఇండ్ల స్థలాల పోరాటంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

**సి.పి.ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ**



కోరుట్ల, మే 23 ( ప్రజాపాలన ప్రతినిధి ): కోరుట్ల పట్టణంలోని సంగం రోడ్డు కు పూలే అంబేడ్కర్ నగరంలో గత 44 వ రోజులుగా సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా ఇండ్ల పోరాటం చేస్తున్నాము, వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిని వదిలిపెట్టి 100 గజాలు ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తున్న వారిపై పోలీసులు రెవెన్యూ సిబ్బంది తప్పుడు కేసులు బనాయిస్తూ అనేక ఇబ్బందుల గురి చేస్తున్నారు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకోని పూలే అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులకు కరెంటు సౌకర్యం కల్పించాలని కేటాయించి పట్టాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ అన్నారు. మంగళవారం రోజున కోరుట్ల పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి ఆర్డిఓ కార్యాలయం వరకు సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో పూలే అంబేడ్కర్ నగరంలో గుడిసేవాసులుకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వేలాది మందితో ర్యాలీగా వెళ్లి అర్.డి.ఓ కి వినతిపత్రం అందించారు. ఈ సభను ఉద్దేశించి లెల్లెల బాలకృష్ణ సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలో వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వాళ్ళు, రాజకీయ బ్రోకర్లు కబ్జాలు చేసుకున్నారు, కానీ సెంటు భూమిలేని వాళ్లు 100 గజాలు ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తుంటే రెవిన్యూ సిబ్బంది పోలీస్ అధికారులు బెదిరింపులు గురిచేయడం, ఇండ్ల దగ్గరికి వెళ్లి మహిళలను బెదిరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 58 ప్రకారం పేదలకు 125 గజాల లోపు ఎలాంటి షరతులు లేకుండా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతిరోజు కోరుట్ల పట్టణంలోని దళితులు గిరిజనులు బలహీన వర్గాలు మైనారిటీ మహిళలు ఇంటి స్థలం కోసం తెగుడిసి పోరాడుతున్నారు, ప్రాణాలైనా అర్పిస్తాను ఇంటి జాగాను వదలం అంటూ నినాదాలు చేస్తూ ఈరోజు భారీ ప్రదర్శన చేశారు, కొద్దిమంది బ్రోకర్లు పోరాటాన్ని అనచడానికి అనేక కుట్రలు చేస్తున్నారని, పోరాటం చేస్తున్న మహిళలపై దుష్ప్రచారం చేస్తూ అనేక ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు,1300 వ్యక్తిగత దరఖాస్తులుకి రెవెన్యూ డివిజన్ అధికారి కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కరీంనగర్ తిరుపతి నాయక్ పట్టణ కన్వీనర్ ఎల్లా పోశన్న, ఇంగ స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ గుమ్మడి రమేష్, సిఐటియు జిల్లా కన్వీనర్ ఇందూరు సులోచన పోరాట కమిటీ నాయకులు రజియా సుల్తానా, నాగరాజు శంకర్ అర్జున్ శివ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణదారులపై తాహసిల్దార్ కి ఫిర్యాదు



శంకరపట్నం వే 23 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండల పరిధిలోని గద్దపాక గ్రామా ముదిరాజ్ కులానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు స్థానిక శంకరపట్నం తాహసిల్దార్ గూడూరి శ్రీనివాసరావు కి మంగళవారం ఫిర్యాదు చేశారు. కాచాపూర్ గ్రామ ఊర చెరువు ఆక్రమణకు పాల్పడుతున్న రైతు, జెసిబి వాహనదారుడు, లెవలింగ్ ట్రాక్టర్ ఓనర్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని ముదిరాజ్ కులానికి న్యాయం చేయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి భూమ సంపత్, ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షులు కీసర సంపత్, కార్యదర్శి భూమ శ్రీనివాస్, సంఘం సభ్యులు అందరూ పాల్గొని ఫిర్యాదు పత్రం అందజేసినారు.

## కొత్తగట్టు ఎల్లమ్మ జాతరకు హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు



శంకరపట్నం మే 23 ప్రజాపాలన రిపోర్టర్: మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతరకు బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి గడ్డం నాగరాజు హాజరై ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అభివృద్ధి కమిటీ, నాయకులకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మాడ వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్, సుధగోని శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## యశోద కృష్ణ గొర్రెల సొసైటీ నూతన పాలకవర్గం ఏకగ్రీవం..



ఎర్రుపాలెం మే 23 మంగళవారం( ప్రజాపాలన ప్రతినిధి ):నేడు మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో యశోద కృష్ణ గొర్రెల సొసైటీ నూతన పాలకవర్గాన్ని అధికారుల ,సభ్యుల,సమక్షంలో,ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులు గా బండారు శ్రీనివాసరావు యాదవ్, ఉపాధ్యక్షులు బాజినేని శ్రీనివాస్ యాదవ్ ,కార్యదర్శిగా బండారు నవీన్ యాదవ ను ఎన్నుకున్నారు. ఎన్నికైనటువంటి అభ్యర్థులు మాపై నమ్మకంతో ఈ గురుతర బాధ్యత మాపై ఉంచినందులకు, అధ్యక్షులు ,సంఘం నాయకులకు, అధికారులకు ప్రత్యేకమైనటువంటి కృతజ్ఞతలు తెలియజేశారు. ఖమ్మం రిజిస్టర్ ఆఫీసర్ అయిన గంగారపు ఉషాశ్రీ ఆ దేశానుసారం ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు . ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం.అక్కిరెడ్డి ,ఎర్రుపాలెం మండలం యాదవ సంఘం నాయకులు బుర్ర. వెంకటనారాయణ యాదవ్, మరియు బనిగండ్లపాడు యశోదకృష్ణ గొర్రెల సొసైటీ సభ్యులు యాదవ సంఘం నాయకులు, పాల్గొని నూతనంగా ఎన్నుకున్న పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



ఇబ్రహింపట్నం మే తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాతృమూర్తి పద్మమ్మ (92) మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి బాధప్తం వ్యక్తం చేశారు.మంగళవారం నాడు వారు ఎమ్మెల్యే స్వగ్రామం ఎలిమినేడులో ఎమ్మెల్యే ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతినితెలిపి పద్మమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటీ )తో పట్టు మంచిరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఎరబెల్లి దయాకర్ రావు ను కలసిన ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రాంరెడ్డి



ఇబ్రహింపట్నం మే తేది 23 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు వంతెన కొరకు ప్రతిపాదనలతో ఈరోజు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో అలుగు పై బ్రిడ్జి నిర్మాణం కొరకు నిధులు వెంటనే మంజూరు చేయాలని మంత్రిగారిని కలిసి విజ్ఞప్తి చేసిన జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఉప్పరిగూడ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి, సుర్వి యాదయ్య గౌడ్, అల్లం దేవి చెరువుగ్రామ సర్పంచ్ తదితరులు తదతరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి:కార్పొరేటర్ చేతన హరీష్




మేడిపల్లి, మే23 (ప్రజాపాలన ప్రతినిధి): హబ్సిగూడ డివిజన్లోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అధికారులకు సూచించారు. ఈ మేరకు కార్పొరేటర్ చైతన్ హరీష్ ఏఈ సాయికిరణ్ తో కలిసి డివిజన్లోని మధురానగర్ కాలనీ గాయత్రి హాస్పిటల్ దగ్గర మెయిన్ రోడ్ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి ప్రధాన కార్యదర్శి ముషిగంపల శివ గౌడ్ జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ రాథోడ్ పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు..



ఎర్రుపాలెం మే 23 మంగళవారం (ప్రజాపాలన ప్రతినిధి): ఎర్రుపాలెం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు .జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తూ తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తపరిశారు .ఎంపీడీవో శ్రీనివాసరావు ,సమక్షంలో ఎంపీపీ దేవరకొండ శిరీష ,మరియు పంచాయతీ సర్పంచ్ మొగిలి అప్పారావు, మండల అధ్యక్షులు పంబి.సాంబశివరావు,సంయుక్త ఆధ్వర్యంలో కార్యదర్శిలు సంఘం మండల అధ్యక్షులు తలుపులు రామారావు, కార్యదర్శి వరికూటి సురేష్ బాబు ,కేసీఆర్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. మా న్యాయమైన డిమాండ్లను అర్థం చేసుకొని క్రమబద్ధీకరించడం తో పాటు ఉద్యోగ భద్రత కల్పించారని, సంతోషం వ్యక్తం చేశారు. మండల కార్యదర్శులయిన కొండలరావు ,ఎం శ్రీనివాస్ రెడ్డి ,పవన్ గోవర్రాజు, శ్రీనివాసరావు,కన్నీదార శ్రీనివాసరావు, మహేష్ ,రామకృష్ణారెడ్డి, మరియు టిఆర్ఎస్ నాయకులు ఎంపీటీసీ సగ్గుర్తి.కిషోర్ బాబు, ఎర్రుపాలెం ఆలయ కమిటీ చైర్మన్ శీపాలశెట్టి తిరుపతిరావు , గుర్రాల.పుల్లారెడ్డి ,ఆకుల నాగేశ్వరరావు, దేవరకొండ రవి, తోటపల్లి బాలరాజు, దేవరకొండ చిరంజీవి, కలపాల ప్రవీణ్ ,తోటపల్లి బాలరాజు, నాయకులు ,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# బ్రో' నుండి సాయి తేజ్ ఫస్ట్ లుక్ రిలీజ్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, సాయి తేజ్ ప్రధాన పాత్రల్లో సముద్రఖని దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లింగ్ కాన్సెప్ట్ మూవీ బ్రో. థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీలో ప్రియా ప్రకాష్ వారియర్, కేతిక శర్మ, తనికెళ్ల భరణి, రాజా చెంబోలు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు చేస్తుండగా దీనిని గ్రాండ్ లెవెల్లో జీ స్టూడియోస్, పీపుల్స్ మీడియా ఫాక్టరీ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రారంభం నాటి నుండి అందరిలో మంచి అంచనాలు ఏర్పరిచిన బ్రో మూవీ, ఇటీవల తమిళ్ లో రిలీజ్ అయి మంచి విజయం సొంతం చేసుకున్న వినోదయ సిత్తం కి రీమేక్ గా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ మూవీ నుండి రిలీజ్ అయిన పవన్ కళ్యాణ్ ఫస్ట్ లుక్ పోస్టర్ కి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభించగా నేడు సాయి తేజ్ ఫస్ట్ లుక్ పోస్టర్ ని కొద్దిసేపటి క్రితం విడుదల చేసారు. మార్కండేయులు (మార్క్) పాత్రలో వైట్ అండ్ వైట్ కాస్ట్యూమ్స్ తో అదిరిపోయే లుక్ లో సాయిధరమ్ తేజ్ ని ఈ పోస్టర్ లో చూడవచ్చు. ప్రస్తుతం ఈ పోస్టర్ కి అందరి నుండి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. మొత్తంగా ఈ సినిమాని అన్ని కార్యక్రమాలు ముగించి జులై 28న విడుదల చేయనున్నారు మేకర్స్.

# తేజ వారసుడు ఎంట్రీ.. ఆసక్తికరమైన విషయాలివే..!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక్కో డైరెక్టర్ కి ఒక్కో స్టైల్ ఉంటుంది. ఈ క్రమంలో ఎంతమంది డైరెక్టర్స్ ఉన్నా సరే ప్రేమకథల స్పెషలిస్ట్ అంటే అందరు చెప్పేది ఒక్కరి పేరే అతనే డైరెక్టర్ తేజ. తేజ సినిమా అంటే అది లవ్ స్టోరీనే పక్కా అని ఫిక్స్ అయ్యేలా ప్రతి ప్రేమకథతో ప్రేక్షకుల మనసులు గెలిచారు తేజ. అంతేకాదు తేజ సినిమా అంటే కొత్త హీరో కొత్త హీరోయిన్ ఇలా అందరు కొత్త వాళ్లతోనే సినిమా ఉంటుందని తెలిసిందే. ప్రస్తుతం దగ్గుబాటి వారసుడు అభిరాం హీరోగా అహింస సినిమా సినిమాతో రాబోతున్నాడు తేజ. ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అన్నది ప్రస్తుతానికి క్లారిటీ రాలేదు. అయితే రీసెంట్



ఇంటర్వ్యూలో తన వారసుడు హీరోగా ఎంట్రీ ఇచ్చే విషయాన్ని వెల్లడించారు తేజ. తేజ కొడుకు సినిమాలపై ఆసక్తిగా ఉన్నాడట. అందుకే తనయుడి ఎంట్రీపై ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నారు తేజ. తన కొడుకుని హీరోగా పరిచయం చేయాలని అనుకుంటున్నా.. తనకు కూడా ఇంట్రెస్ట్ ఉందని.. అందుకే విదేశాల్లో అందుకు సంబంధించిన కోర్సులు చేస్తున్నాడని అన్నారు. తను చూడటానికి అందంగా ఉంటాడు. అయితే హీరోగా చేయడానికి అదొక్కటే సరిపోదు కదా అని అన్నారు తేజ. ఇక తనయుడిని తాను డైరెక్ట్ చేస్తానా లేక మరొవరికైనా అప్పగించాలా అన్నది ఇంకా నిర్ణయించలేదని అన్నారు తేజ. అహింస సినిమా రిలీజ్ ఎప్పుడన్నది ఇంకా ఫైనల్ అవలేదు. అసలైతే ఏప్రిల్ లో రిలీజ్ అవ్వాల్సి ఉన్న ఈ సినిమా రిలీజ్ విషయంలో దర్శక నిర్మాతలు ఎందుకు లేట్ చేస్తున్నారన్నది అర్థం కావట్లేదు. అహింస తో తేజ మరోసారి తన డైరెక్షన్ టాలెంట్ చూపించాలని చూస్తున్నారు. ఈ సినిమా తర్వాత గోపీచంద్ తో ఒక సినిమా ప్లానింగ్ లో ఉంది. ఆ సినిమా గురించి డీటెయిల్స్ కూడా త్వరలో తెలుస్తాయి.

# తెలుగు సినిమాలపై కన్నేసిన జియో సినిమా..!


బాహుబలి తర్వాత తెలుగు సినిమా రేంజ్ మారిపోయింది. అప్పటి వరకు తెలుగు సినిమా కాస్త చులకనగా చూసేవారు కూడా ఇప్పుడు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక ఆర్ఆర్ఆర్ కి ఆస్కార్ వచ్చిన తర్వాత తెలుగు సినిమా క్రేజ్ మరింత పెరిగిందనే చెప్పాలి. తెలుగులో నటించాలని ఇతర ఇండస్ట్రీల వాళ్లు తహతహలాడుతున్నారు. మరోవైపు తమ సినిమాల్లో తెలుగు హీరోలను తీసుకుంటే తమ మూవీకి కూడా క్రేజ్ వస్తుందని వారు భావిస్తున్నారు. మరో వైపు ఓటీటీ సంస్థలు సైతం తమ కళ్లన్నీ తెలుగు సినిమాలపై పెడుతండటం విశేషం. ఓటీటీల్లో తెలుగు సినిమాలు రావడం సహజమే. కానీ ఎక్కువగా అమేజాన్ ప్రైమ్ హాట్ స్టార్ వంటి వాటిల్లోనే వచ్చేవి. నెట్ ఫ్లిక్స్ లో కూడా చాలా తక్కువ సినిమాలు వచ్చేవి. ఇక జియో సినిమా సంగతి అయితే చెప్పనక్కర్లేదు. ఎక్కువ సినిమాలు అన్నీ హిందీ ఇంగ్లీష్ వే ఉంటాయి. తెలుగు చాలా అరుదుగా ఉంటాయి. అయితే ఈ విషయంలో జియో సినిమా తాజాగా ఓ నిర్ణయం తీసుకుందట. తెలుగు సినిమాకి పెరుగుతున్న మార్కెట్ ని దృష్టిలో పెట్టుకొని జియో సినిమా పెద్ద ప్లాన్ వర్కౌట్ చేస్తున్నట్లు సమాచారం. తమ జియో సినిమాలో ఎక్కువ తెలుగు సినిమాలు ఉండేలా ప్లాన్ చేయాలని అనుకుంటోందట. ఇక నుంచి విడుదలయ్యే సినిమాల్లో ఎక్కువ శాతం సినిమాలను జియో సినిమా కొనుగోలు చేయాలని ప్లాన్ వేస్తోందట. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న చాలా సినిమాలను కొనుగోలు చేయడానికి జియో సినిమా ప్లానింగ్ మొదలుపెట్టినట్టు సమాచారం. ఏది ఏమైనా ఇలాంటి వార్తలు వింటున్నప్పుడు చాలా ఆనందం వేస్తుంది. మన తెలుగు సినిమా స్థాయి రోజు రోజుకీ పెరుగుతుండటం నిజంగా మనకు గర్వ కారణమే. మరి జియో సినిమా ఎలాంటి సినిమాలను కొనుగోలు చేస్తుందో చూడాలి. ఇదిలా ఉంటే జియో సినిమా మొన్నటి వరకు ఉచితంగా ఉండేది. ఇప్పుడు దానికి కూడా ఛార్జీలు కేటాయించారు. జియో సినిమా ప్రీమియం సబ్స్క్రిప్షన్ ప్లాన్ ధర రూ. 999 గా ఉంది. ఏడాది వ్యాలిడిటీ ఉంటుంది. జియో సినిమా ప్రీమియం సబ్స్క్రిప్షన్ రీచార్జ్ చేసుకోవాలి అనుకునే వారు యూపీఐ డెబిట్ కార్డు క్రెడిట్ కార్డుతో చెల్లింపులు చేసి రీచార్జ్ చేసుకోవచ్చు.

# మరోసారి విజయ్ వర్సెస్ ఎస్ జె సూర్య?



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు అట్లీ తో చేసిన చిత్రాలు మంచి హిట్స్ కాగా ఈ చిత్రాల్లో సెన్సేషనల్ హిట్ చిత్రం "మెర్సల్" కూడా ఒకటి. మరి ఈ చిత్రంలో వెర్సటైల్ నటుడు ఎస్ జె సూర్య ని ఓ క్రేజీ విలన్ గా అయితే అట్లీ చూపించాడు. అంతే కాకుండా విజయ్ మరియు ఎస్ జె సూర్య మధ్య ఎలాంటి సీన్స్ కూడా ఉన్నాయో తెలిసిందే. ఇక ఈ క్రేజీ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానున్నట్టుగా తెలుస్తుంది. అయితే ఈసారి దర్శకుడు వెంకట్ ప్రభు చిత్రంలో మరోసారి విజయ్ వర్సెస్ సూర్య కాంబో ని చూడబోతున్నట్టుగా తెలుస్తుంది. ప్రస్తుతానికి అయితే ఈ కాంబినేషన్ పై చర్చలు నడుస్తుండగా ఎస్ జె సూర్య ఇంకా ఫైనల్ కావాల్సి ఉంది. ఇక దీనికి ముందే ఎస్ జె సూర్య అయితే విజయ్ "వారిసు" లో కూడా ఓ కీలక పాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే.

# హాలీవుడ్ దర్శకులకే చరణ్ కండీషన్లు!



ఆర్ ఆర్ ఆర్ విజయంతో రామ్ చరణ్ రేంజ్ హాలీవుడ్ ని తాకింది. ఆస్కార్ అవార్డు గుర్తింపుతో ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయ్యారు. ఒక్క హిట్ తో గ్లోబల్ స్టార్ అయ్యారు. ప్రియాంక చోప్రా తర్వాత ఇండియా నుంచి గ్లోబల్ గుర్తింపు చరణ్ కి మాత్రమే దక్కింది. తాజాగా చరణ్ కశ్మీర్ లో జరుగుతోన్న జీ-20 సదస్సకు ఇండియన్ స్టార్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో ఎన్నో విషయాలు పంచుకున్నారు. అవేంటో ఆయన మాటల్లోనే..ఇండియాలో ఎన్నో అందమైన లొకేషన్లు ఉన్నాయి. కశ్మీర్ లో ఈ సదస్సు పెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. కేరళ..కశ్మీర్ లాంటి ఎన్నో ప్రాంతాల్లో ప్రకృతి ఎంతో బాగుంటుంది. షూటింగ్ లకు ఎంతో అనుకూలంగా ప్రదేశాలివన్ని. నా సినిమాల ద్వారా వీటిని ప్రపంచానికి చూపించాలనుకుంటున్నా. అందుకే నేను నటించే సినిమాలు ఎక్కువగా ఇండియాలోనే షూటింగ్ జరగాలని కోరుకుంటున్నా. ఇకపై కేవలం లొకేషన్లు కోసం ఇతర దేశాలకు వెళ్లకూడదని నిర్ణయం తీసుకున్నా. నేను హాలీవుడ్ సినిమాల్లో నటించినా అక్కడ దర్శకులకు ఇండియా అందాలు చూపిస్తాను. ఇక్కడ కూడా షూటింగ్ చేయాలని కండీషన్ పెడతాను. నార్త్..సౌత్ అని రెండు రకాల సినిమాలు లేవు. ఉన్నది ఒక్కటే సినిమా అది. భారతీయ సినిమా. ఇప్పుడు మన సినిమా గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆర్ ఆర్ ఆర్ సినిమాతో జపాన్ ఆడియన్స్ కు ఎంతో దగ్గరయ్యాం. అక్కడి ప్రజలు ఎంతో ఆత్మీయంగా ఉంటారు. జపాన్ అంటే ఉపాసనకి ఎంతో ఇష్టం. ఇప్పుడామె ఏడు నెలల గర్భిణి. ఇప్పుడు జపాన్ వెళ్దామన్నా! రెడీ అంటుంది. చిన్నప్పుడు నాన్న గారితో కలిసి సినిమా షూటింగ్ కోసం కశ్మీర్ వెళ్లాను. అప్పటి నుంచి ఎన్నో సార్లు ఇక్కడికి వచ్చాను. నాన్న గారికి ఇప్పుడు 68 ఏళ్లు. ఇప్పటికీ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నారు. అంత పెద్ద హీరో అయినా ఇప్పటికీ ఉదయం 5.30 గంటలకు నిద్ర లేస్తారు. ఆయనకి సినిమాలపై అంతటి నిబద్ధత ఉంటుంది. ఆయన్ని చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఆయనే నాకు స్పూర్తి- అని అన్నారు.

# "ది కేరళ స్టోరీ" 200 నాటౌట్!




ది కేరళ స్టోరీ చిత్రం చిన్న సినిమా గా థియేటర్ల లో విడుదల అయ్యి, సెన్సేషన్ క్రియేట్ చేస్తుంది. కంటెంట్ బాగుంటే, ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తారు అని మరోసారి ది కేరళ స్టోరీ చిత్రం తో రుజువైంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ గా స్ట్రాంగ్ గా కొనసాగుతోంది. ఈ చిత్రం సోమవారం రోజు మరో 4.50 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. దీంతో ఈ సినిమా ఇప్పటి వరకూ 203.4 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం 200 కోట్ల రూపాయల క్లబ్ లో చేరడం తో చిత్ర యూనిట్ సంతోషం లో ఉంది. లాంగ్ రన్ లో ఈ చిత్రం మరింత వసూళ్ళను రాబట్టే అవకాశం ఉంది. వీక్ డేస్ కావడం తో కలెక్షన్స్ కాస్త డ్రాప్ అయిన, ఆదరణ మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. సుదిప్తో సేన్ దర్శకత్వం లో తెరకెక్కిన ఈ చిత్రం లో అదా శర్మ, సిద్ధి ఇద్నానీ లు కీలక పాత్రల్లో నటించారు.

మాస్టర్ కీ TV
Jai B Bhoomi News Channel Limited
CIN NO: U74999TG2018PLC128263
మాస్టర్ కి టీవీ ఛానల్ లో డైరెక్టర్స్ ని
ఈ క్రింది విభాగాల నుంచి తీసుకొనబడును
1. ప్రతి కులం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
2. ఒక్కొక్క డిపార్ట్ మెంట్ నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
3. సమస్యల గురించి పోరాడే ఒక్కొక్క సోషల్ విభాగం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
4. మైనార్టీస్, ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్ మొదలగు వారి నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
5. అభ్యుదయ వాదుల నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
6. ఒక్కొక్క పార్లమెంట్ నుంచి లేక జిల్లా నుంచి ఒక్కొక్క స్టాఫ్ రిపోర్టర్ ని తీసుకొనబడును.
7. మహిళలు & N.G.O ల నుండి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
8. యూత్ సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
9. కార్మిక సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి నాయకులను తీసుకొనబడును.
ఇంకా మీకు తెలిసిన విభాగాలను తెలియపరచగలరు
డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన్, IRS-vrs
చైర్మన్ మాస్టర్ కీ టీవీ ఛానల్
(జై బి భూమి న్యూస్ ఛానల్ లిమిటెడ్)

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989